జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 08 మార్చి 2026 | సంపుటి: 18 | సంచిక: 362 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఫల్గుణం, తిథి: ద్వాదశి - 20:45:45 వరకు నక్షత్రం: పునర్వసు - 09:35:50 వరకు కరణం: బవ - 09:38:55 వరకు, బాల: వ - 20:45:45 వరకు పక్షం: శుక్ల యోగం: సౌభాగ్య - 17:01:49 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## మా దాడులు ఉద్దేశ్యపూర్వకం కాదు

**గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు**

టెహ్రాన్,మార్చి 7(ప్రజాజ్యోతి): గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణలు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. అయితే ఆయా దేశాలు తమ

మిగతా 12లో..

## గవర్న్ జిష్ణుదేవ్ వర్మతో భట్టి భేటీ

హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ పై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం, శాలువాతో

మిగతా 2లో..

# అంతర్జాతీయ సంతాలి సభ వేదిక మార్పు

- రాష్ట్రపతిని స్వాగతించని మమత, మంత్రులు
- బెంగాల్ వ్యవహారంపై ముర్ము అసహనం
- మమత తన చిన్న చెల్లెలంటూ కితాబు
- రాష్ట్రపతినే అవమానిస్తారా?
- ఇది సిగ్గుచేటైన విసయంగా పరిగణిస్తున్నాం
- ముర్ముకు అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం




కోల్‌కతా,మార్చి 7: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసు కోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా కారణాల పేరుతో బిధాన్‌నగర్‌లో జరగాల్సిన సదస్సు వేదకను బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని గోసాయిపూర్‌కు మార్చడం, వేదక చిన్నది కావడంతో గిరిజన కమ్యూనిటీకి చెందిన వారు పెద్దసంఖ్యలో రాలేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు రాకుండా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమె మంత్రులు

మిగతా 2లో..

## ట్రంప్ హత్యకు ప్లాన్..!?

- హిట్ లిస్టులో జో బైడెన్, నిక్కీ హేలీ కూడా..
- ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్
- పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు



న్యూయార్క్, మార్చి 7(ప్రజాజ్యోతి): డోనాల్ట్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసిన కేసులో పాకిస్థానీ వ్యక్తిని అమెరికా న్యాయశాఖ శుక్రవారం దోషిగా తేల్చింది. ఇరాన్ ఆదేశాల ప్రకారం అతను అమెరికా రాజకీయ వేత్తలను హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. నిందిత వ్యక్తిని ఆసిఫ్ మెర్చంట్‌గా గుర్తించారు. 2020లో ఇరాన్ మిలిటరీ నేత ఖాసిమ్ సొలేమని హత్యకు ట్రంప్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో

మిగతా 12లో..

## శాంతియుత వాతావరణమే

# శ్రీరామరక్ష

## లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

- 130 మంది మావోయిస్టులు లొంగుబాటు
- గణపతి కూడా లొంగి పోవాలన్న సీఎం రేవంత్
- ఆయుధాలను అప్పగించిన మావోలు
- లొంగిన వారికి హోదాను బట్టి నగదు ప్రోత్సాహకం



హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు

మిగతా 2లో..

## మహిళల రక్షణ సమాజం బాధ్యత

- వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
- ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
- మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి
- స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం రేవంత్




హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని

మిగతా 12లో..

## రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు?

**మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా!?**

**కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు**

కరీంనగర్,మార్చి 7(ప్రజాజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు

మిగతా 12లో..




## సైబరాబాద్ మహిళా పోలీసుల

# ప్రతిభ

## ప్రతిభ, అంకితభావంతో గుర్తింపు

- శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన ముద్ర
- సైబరాబాద్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- వివిధ రంగాల మహిళా ప్రముఖుల హాజరు
- క్రమశిక్షణ, పట్టుదలతోనే రాణిస్తామని పలువురు సూచన





హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, మహిళా పోలీస్ అధికారులు క్రమశిక్షణతో కూడిన పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కవాతులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, సమన్వయం, వృత్తిపరమైన అంకితభావం పరేడ్‌కు మరింత గౌరవాన్ని చేకూర్చింది. నగరానికి విచ్చేసే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు ఇచ్చే 'గార్డ్ ఆఫ్ హానర్', వారి సమయపాలన మరియు బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అద్దం పడుతోంది.కేవలం పగటి విధులతోనే పరిమితం కాకుండా, మహిళా పోలీసులు రాత్రి సమయాల్లోనూ అత్యంత అప్రమత్తతతో సెంట్రీ విధులను నిర్వర్తిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద నిరంతరం కాపలా కాస్తూ నగర భద్రతా వ్యవస్థలో తమవంతు కీలక పాత్ర పోషిస్తున్నారు.వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, హోం గార్డ్స్ వార్షికోత్సవం వంటి అధికారిక కార్యక్రమాల్లో మహిళా పోలీసులు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. సభలను సమర్థవంతంగా నడిపిస్తూ, తమ వాగ్ధాటితో కార్యక్రమ నిర్వహణను

మిగతా 2లో..

## 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి
- పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): ప్రజాపాలన– ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా

మిగతా 12లో..

## జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు అస్వస్థత

**అధకారులతో సమిక్ష చేస్తుండగా వాంతులు**

రాజమండ్రి,మార్చి 7(ప్రజాజ్యోతి): రాజమండ్రి పర్యటనలో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మాక్వానా శనివారం అస్వస్థతకు గురయ్యారు. ఆయన రాజమండ్రిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో కిషోర్ మాక్వానా.. స్వల్ప

మిగతా 12లో..

## గ్లోబల్ హబ్‌గా

# హైదరాబాద్

## ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

## మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం నాడు బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ ఓ ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన

మిగతా 12లో..

# సంపాదకీయం

## మహిళలకు వందనాలు !

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్త్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మీ, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగవస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్దరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సొవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్ధరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరివించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు. 1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది.లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

## శాంతియుత వాతావరణమే
# శ్రీరామరక్ష

మొదటిపేజీ తరువాయి..

చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ఊాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు. పూర్తి వివరాలు వీడియోలో చూడండి. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో రైఫిళ్లు ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా జనజీవన స్రవంతిలో కలుస్తున్న క్యాడర్లకు అదనంగా ప్రోత్సాహకాలు అందనున్నాయి.

## సైబరాబాద్ మహిళా పోలీసుల
# ప్రతిభ



మొదటిపేజీ తరువాయి..

ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతిష్టాత్మక 'మిస్ వరల్డ్' పోటీల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరును పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందుతున్న ఈ గుర్తింపు, ఇతర మహిళా సిబ్బందికి స్ఫూర్తినిస్తోంది. విధి నిర్వహణలో మహిళా పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రాణదాతలుగానూ నిలుస్తున్నారు. పరిగి నుంచి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ముగ్గురు ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు దీపశ్రీ, వనజ, పద్మలు ప్రమాద స్థలిలో చూపిన చొరవ అభినందనీయం. ప్రమాదానికి గురైన బస్సు వెనుక ప్రయాణిస్తున్న వీరు, ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నారు. క్షణమాత్రం ఆలస్యం చేయకుండా, మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది క్షతగాత్రులకు సీపీఆర్ నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన హాజరుకాగా, గౌరవ అతిథులుగా 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్ రామ్, ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, వివిధ విభాగాల డీసీపీలు, పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, జీహెచ్ఎంసీ అధికారులు, రైతులు మరియు వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. 'గివ్ టూ గైన్' థీమ్ తో ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా శక్తిని గౌరవించడం, సమాజంలో వారి పాత్రను గుర్తించడం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. సమాజంలో సానుకూల మార్పులకు మహిళా సాధికారత ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యం మరియు నిరంతర కృషి అవసరమని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన అన్నారు. చిన్నప్పటి నుంచే సమాజానికి సేవ చేయాలనే తపన తనలో ఉండేదని, తన తండ్రి బాలరామయ్య స్ఫూర్తితోనే సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్ లో మాస్టర్స్ పూర్తి చేసిన తాను, క్రమబద్ధమైన ప్రణాళికతో చదివి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో దేశవ్యాప్తంగా 44వ ర్యాంక్ సాధించినట్లు వివరించారు. యువత తమపై తాము నమ్మకం ఉంచి, కష్టపడి చదివితే ఎలాంటి కఠినమైన లక్ష్యనైనా సులభంగా సాధించవచ్చని ఆమె ఈ సందర్భంగా సూచించారు. రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు విజయ రామ్ అన్నారు. పాతకాలపు సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారానే భూమిని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని సూచించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ రూపొందించిన సహజ సిద్ధమైన విధానాలను పాటిస్తే.. రైతులు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ముఖ్యంగా కులాకర్ వంటి సంప్రదాయ బియ్యం రకాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని, ఇవి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రజలందరూ రసాయన రహిత ఆహారాన్ని తీసుకోవాలని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, సహజ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు, ప్రజలకు హైదరాబాద్‌లో ఏడాది పొడవునా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ .. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. మహిళల ఆరోగ్యం, భద్రత, విద్య , ఆర్థిక స్వాలంబన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా మాట్లాడుతూ, ఆరోగ్యం అంటే కేవలం మనం తీసుకునే పోషకాహారం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మనం తీసుకునే ఆహారం కేవలం శారీరక శక్తికే కాకుండా, మన ఆలోచనలను మరియు ఒత్తిడిని నియంత్రించే మెదడు పనితీరును కూడా ప్రభావితం చేస్తుందని ఆమె వివరించారు. పోషక విలువలున్న ఆహారమే మానసిక ప్రశాంతతకు పునాది అని, ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి పోషణ, మనస్తత్వ శాస్త్రం రెండూ సమన్వయంతో ఉండాలని ఆమె పేర్కొన్నారు. చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్ కన్సల్టెంట్ హరిణి మాట్లాడుతూ.. పిల్లలు కౌమారదశలో ఉన్నవారి మానసిక ఆరోగ్యం, వారి వికాసం కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమం ముగింపులో, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులను, సిబ్బందిని మరియు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మియాపూర్, పటాన్‌చెరు, నిజాంపేట్, మరియు మాదాపూర్ ప్రాంతాల మహిళా పారిశుధ్య కార్మికులను వేదికపై ప్రత్యేకంగా సన్మానించి, వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ వేడుకలో భాగంగా పలువురు నిపుణులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా మార్చారు. ఏఎస్ఐ కె. వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమం అందరినీ అలరించింది. అలాగే, శ్రీలత, శ్రీకృష్ణల గీతాలాపన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎక్స్ పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శనలో మహిళలకు సంబంధించిన రకరకాల దుస్తులు, చేనేత వస్త్రాలు, అలంకరణ వస్తువులు మరియు పోషక విలువలున్న ఆహార పదార్థాల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీసీ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ట్రాఫిక్–ఎ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్–ఎఎ డీసీపీ ఎస్. శేషాద్రిని రెడ్డి, ఏడీసీపీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అంతర్జాతీయ సంతాలి సభ వేదిక మార్పు

మొదటిపేజీ తరువాయి..

దూరంగా ఉండిపోయారు. రాష్ట్రపతికి సిలిగురి మేయర్ దేవ్ స్వాగతం పలికారు. సభావేదిక మార్పుపై ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. ఇక్కడకు రావడం చాలా ఈజీగానే వచ్చానని, అయితే జనసమ్మర్ధం ఎక్కువగా ఉంటుందనే కారణంగా వేదికను మార్చినట్టు అధికార యంత్రాంగం చెప్పిందని తెలిపారు. 'రాష్ట్రపతి వచ్చి జనసమర్ధం లేని చోట ఈవెంట్‌లో పాల్గొని వెళ్లిపోతారని వారు అనుకుని ఉంటారు. వాళ్ల ఆలోచన ఏమిటో నాకు తెలియదు. ఈ పరిణామం చాలా బాధాకరంగా ఉంది' అని అన్నారు. రాష్ట్రపతి తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేసినప్పటికీ సీఎం విషయంలో ఆచితూచి మాట్లాడారు. మమతా బెనర్జీ తన చిన్న చెల్లెలని, తాను కూడా బెంగాల్ కూతుర్నేనని అన్నారు. ఏదో కారణం వల్ల



ఆమెకు (మమతా బెనర్జీ) తనపై కోపం వచ్చి ఉండవచ్చని అన్నారు. ఆమెపై తానెలాంటి కంప్లయింట్ చేయదలచుకోలేదని చెప్పారు. అందరూ బాగుండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. నార్త్ బెంగాల్‌లో ఆదివాసీలు, గోర్ఖాలు, రాజ్‌బన్షీలు, బెంగాలీలు కలిసిమెలసి ప్రశాంతంగా జీవిస్తుండటం, సామాజిక సామరస్యం చాటుకోవడంపై రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి తన పర్యటన సందర్భంగా స్థానిక గిరిజనులతో సంభాషించారు. ద్రౌపది ముర్ము రాక సందర్భంగా రాష్ట్రపతి కార్యాలయానికి ఉన్న గౌరవాన్ని మమతా బెనర్జీ దిగజార్చారని బీజేపీ మండిపడింది. ఇది టీఎంసీ ప్రభుత్వ నిర్వహణా వైఫల్యాన్ని చాటుతుందని పార్టీ నేత అమిత్ మాలవీయ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇది సిగ్గుచేటని, మునుపెన్నడూ జరగలేదని టీఎంసీ పైన, మమతా బెనర్జీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో ఆపార దుఃఖాన్ని కలిగించింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులు అతిక్రమించిందనీ, రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాగానిదే బాధ్యత అని అన్నారు.ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణం ఏమిటో వారికే తెలియాలని, అయితే తనపై మమత ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషంలేదని, ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. తాను కూడా బెంగాల్ కూతుర్నేనని గుర్తుచేశారు.

## మా దాడులు ఉద్దేశ్యపూర్వకం కాదు

మొదటిపేజీ తరువాయి..

భూభాగాల నుంచి ఇరాన్‌పై దాడిని ప్రారంభించకుంటే తాము కూడా దాడి చేయమని అన్నారు. ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ దేశం తాజా ప్రకటనతో ఉద్రిక్తతలు సడలే అవకాశం ఉంది. ఘర్షణల కారణంగా పొరుగుదేశాల్లో అనిశ్చితి తలెత్తడంపైనా పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో సంక్షోభం మరింత విస్తరించాలని ఇరాన్ కోరుకోవడం లేదని అన్నారు. 'ఇరాన్ జరిపిన దాడులకు పొరుగు దేశాలకు వ్యక్తిగతంగా, ఇరాన్ తరఫున క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నట్టు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. పొరుగుదేశాలపై దాడులు చేయమని ఇరాన్ అధ్యక్షుడు ఓవైపు చెబుతూనే మరోవైపు అమెరికా–ఇజ్రాయెల్ ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదని చెప్పారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసు కోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ సక్సెస్ కారని, తమ దేశాన్ని తాము కాపాడుకుంటామని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. కాగా, పొరుగుదేశాలపై దాడి చేయమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించిన ప్పటికీ గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్లు వినిపిస్తున్నాయి. క్షిపణులు, డ్రోన్‌లను ఎయిర్ డిఫెన్స్ సిస్టంలు అడ్డుకుంటున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. విమానాశ్రయం సమీపంలో పెద్ద శబ్దం వినిపించడంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆపరేషన్లను శనివారం నాడు నిలిపివేశారు. ఇది చిన్న ఘటనేనని, అయితే ప్రయాణికుల భద్రత రీత్యా విమాన సర్వీసులను రద్దు చేశామని అధికారులు తెలిపారు. తాజా ఘర్షణల్లో ప్రాణనష్టం కూడా భారీగానే ఉన్నట్టు చెబుతున్నారు. ఇరాన్‌లో 1,200మంది ప్రాణాలు కోల్పోగా, లెబనాన్‌లో సుమారు 200 మంది ఇజ్రాయెల్‌లో డజను మంది ప్రాణాలు కోల్పోయారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించినట్టు చెబుతున్నారు. గల్ఫ్ వ్యాప్తంగా ఎయిర్ ట్రావెల్‌కు అంతరాయం కలగడంతో వేలాది విమానాలు రద్దవుతున్నాయి. క్షిపణులు, డ్రోన్ దాడుల భయంలో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భట్టి భేటీ

మొదటిపేజీ తరువాయి..

సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. అలాగే ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందించారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.

## నగరంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్

హైదరాబాద్,మార్చి 7(ప్రజాజ్యోతి): నగర ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని లాలాపేటపరిధిలో నిర్వహిస్తున్న ఒక గోడౌన్ పై టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ జోన్, లాలాగూడ పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన ముందస్తు సమాచారంతో లాలాగూడ(ఒజ్గీ÷జీణబీటజీ) పోలీసులతో కలిసి లాలాపేటలోని 'జానీ అల్లం వెల్లుల్లి పేస్ట్' గోడౌన్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అత్యంత అపరిశుభ్రమైన వాతావారణంలో ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండాలని, రంగు మారకుండా ఉండటానికి నిందితులు ఎసిటిన్ యాసిడ్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. ఈ సోదాల్లో దాదాపు 1,915 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 30 కిలోల ఎసిటిక్ యాసిడ్, పేస్టు తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర ముడి సరకులు, ప్యాకింగ్ మెటీరియల్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీలా వెంకటేశ్వర్లుతోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం లాలాగూడ పోలీసులు తీసుకెళ్లారు.

దర్శించండి తరించండి
శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి,జగిత్యాల జిల్లా.
శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములు (జాతర) ఆహ్వానము
తేది: 27.02.2026 నుండి 11.03.2026 వరకు అత్యంత వైభవముగా జరుగును
బ్రహ్మోత్సవముల ముఖ్య కార్యక్రమములు
ముఖ్య అతిథి: మాన్యశ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు


# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు వినతి



**ఖానాపూర్ మార్చి 7 (ప్రజా జ్యోతి) :** చిరు ఉద్యోగులైన అంగన్వాడీల పలు సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జు పటేల్‌కు తెలంగాణగా అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు శనివారం స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ ఉపాధ్యక్షురాలు వంగ వరలక్ష్మి లీలారాణి భాగ్యరేఖ లక్ష్మి గంగామణి సునీత విజయనిర్మల రాష్ట్ర ఉపాధ్యక్షులు స్థానిక అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి చందు రాణి తదితరులు పాల్గొన్నారు వేసవికాలం సమీపించినందున మార్చి 15 నుండి ఒంటిపూట బడి తొపాటు ఆయాలకు అంగన్వాడి టీచర్లుగా ప్రమోషన్ రిటైర్డ్ అయిన అంగన్వాడి ఆయాల బెనిఫిట్స్ విడుదల అదనపు భారాన్ని అంగన్వాడీలపై పడకుండా చూడాలని ముఖ్యంగా బిఎల్ఓగా తమను నియమించరాదని పెంచిన వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కొత్తమొబైల్ ఫోన్లఅప్ ఇవ్వాలని ఈ యాప్లతో సొంత ఫోన్‌లో నిర్వహణ ఇబ్బంది కలుగుతుందన్నారు సముచితమైన తమ కోర్కెలను వెంటనే అమలు చేయాలని వినతిపత్రంలో అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ కోరింది.

# నూతన వదు వరులను ఆశీర్వదించిన బోథ్ ఎమ్మెల్యే



**నేరడిగొండ మర్చి 07 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన అప్క రవి యాదవ్ కూతురి పెండ్లి అదిలాబాద్ జిల్లా కేంద్రంలోనీ గాయత్రి గార్డెన్ లో ఘనంగా జరగగా ఆ వివాహానికి హాజరైన నూతన వదు వరులను ఆశీర్వదించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇందులో ఇచ్చోడ బి ఆర్ ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నేరడిగొండ బి ఆర్ ఎస్ కార్యకర్తలు వాంకిడి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## ఎంపీడీవో రాథోడ్ రాధ





**లక్ష్మణ చాంద, మార్చ్ 7 (ప్రజా జ్యోతి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాథోడ్ రాద అన్నారు. శనివారం రోజున లక్ష్మణ చాంద మండలం చామనపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ లక్ష్మి సుదర్శన్ అధ్యక్షతన మాట్లాడారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్లాస్టిక్ నిరోధించే కార్యక్రమాలు చేపడుతూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రతి మహిళ తడి చెత్త పొడి చెత్త వేరుచేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ కి అందజేయాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. ఎస్ హెచ్ జి సభ్యులతో మాట్లాడి వారి సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి,పంచాయతీ కార్యదర్శి వనిత, ఐకెపి సిబ్బంది, వివో ఏలు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి - కలెక్టర్ కె. హరిత





**ఆసిఫాబాద్ టౌన్ మార్చి 7 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. శనివారం దహేగాం మండలంలోని ఐనం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, టాయిలెట్లు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను వారానికి కనీసం ఒకసారి గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ కార్మికులచే శుభ్రం చేయించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త కుండీలలో వేయాలని తెలిపారు. టాయిలెట్ గదులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని పేర్కొన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తరచూ పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పించిందని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లాలో ముఖ్య అధికారులంతా మహిళా మణులే

- కలెక్టర్, జడ్జ్, ఎస్పి, ట్రెజరిలు ప్రజా అందుబాటులో సమర్ధ పాలన
- నేడు జాతీయ మహిళా దినోత్సవం







**ఖానాపూర్ మార్చి 7 (ప్రజా జ్యోతి) :** లోకాల సృష్టికర్త బ్రహ్మ అయితే బ్రహ్మను సృష్టించినది అమ్మే మానవాళిలో అమ్మ (మహిళ) లేనిదే జననం లేదు. అమ్మగా అక్కగా చెల్లిగా చెలియాగా భార్యగా బ్రతుకు బాటకు నిదర్శనం మహిళ. శాంతి సహనం అంకిత భావం ప్రేమ ఆప్యాయత ధైర్యం పాలనా దక్షత కలిగిన మహిళ సాహసానికి దిక్సూచిగా సంబరం జరుపుకునేదే జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళను పరిపరి విధాలుగా గౌరవించడం భారతీయ సంస్కృతి కేవలం వంటింట్లో కుందేలుగా కుటుంబానికి వంటలు చేసి వడ్డించి కడుపు నింపడమే కాకుండా అన్ని రంగాల్లో దేనికి తీసిపోని విధంగా నిర్మల్ జిల్లాలో ఉన్నత స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా పోలీస్ బాస్ ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల, జిల్లా న్యాయ పరిపాలన అధికారి జడ్జి శ్రీమతి శ్రీవాణి జిల్లా ట్రెజరరీ అధికారిని డిటిఓ సరోజ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని డిఆర్‌డిఓ విజయలక్ష్మి రెవెన్యూ డివిజనల్ అధికారిని రత్నకళ్యాణిలు ఒకరంటే ఒకరిని తీసుకొని విధంగా పాలన దక్షత తో నిర్మల్ ప్రజల్ని గాడిలో పెట్టి సమర్థవంతమైన పాలన జరిపి నిరూపించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అహర్నిశలు కష్టపడుతూ జిల్లాలోని అన్ని శాఖల్ని తనిఖీలు చేస్తూ క్రమశిక్షణగా నడిపేందుకు రాత్రి బవల్లు పర్యటనలు సమావేశాలు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఆర్జీలు స్వీకరించి పరిష్కరించడంలో ముందుకు సాగుతుంటే, జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల తనదైన శైలిలో నిర్మల్ జిల్లా పోలీస్ మీ పోలీస్ అంటూ వినూత్న కార్యక్రమాలు నిర్వహించి సోమవారం తో పాటు వీలైన ప్రతిరోజు ప్రజా పాలన నిర్వహిస్తూ పోలీస్ శాఖ లో గల ప్రజల ఆక్షేపానలను ఆర్జీలను స్వీకరించి అప్పటికప్పుడు ఫోన్లో పరిష్కరిస్తున్నారు. ఈ మేరకు అప్పటికప్పుడే పరిష్కారాలను సైతం చేయడంలో కృతజ్ఞులయ్యారు సఖి,పోలీస్ అక్క, శివంగి, భరోసా లాంటి కార్యక్రమాలతో పాటు ముఖ్యంగా ఆడపిల్లలకు వసతి గృహాల్లో రెసిడెన్షియల్ కళాశాల పాఠశాలలో చదివే విద్యార్థినులకు అండగా ఒక రోజు బస చేసి వారికి ధైర్యాన్ని మనోధైర్యాన్ని కల్పించి విద్యనభ్యసించడంలో ముందుకు సాగేలా చర్యలు తీసుకోవడం గమనార్హం శాంతి పద్ధతులతో పాటు సామాజిక కార్యక్రమాల్లో భాగంగా క్రీడలు మూఢనమ్మకాల పట్ల అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణకు సూచనలు డ్రంక్ అండ్ డ్రైవ్ మత్తు పదార్థాల పై ఉక్కు పాదాన్ని మోపి ప్రజల్ని అప్రమత్తం చేసి సురక్షిత బాటలో నడిపించడానికి కృషి సల్పుతున్నారు జిల్లా న్యాయ అధికారిని జడ్జి శ్రీవాణి చాకచక్యంగా అనేక రోజుల పెండింగ్‌లో ఉన్న న్యాయపర కేసులను చేదించడంలో ఎప్పటికప్పుడు న్యాయ సమావేశాలు జిల్లా కలెక్టర్ ఎస్పీలతో పాటు న్యాయశాఖ అధికారులు సమావేశాలను నిర్వహించి పేరుకుపోయిన కేసులను ఆయా స్టేషన్లో వారిగా పిపీలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పరిష్కరింపజేసి శిక్షలు వేసి పెండింగ్లో ఉన్న వాటికేసులను పరిష్కరించడంలో ముందున్నారు జిల్లా ట్రెజరరీ శాఖ అధికారిని డిటిఓ సరోజ సైతం ఉద్యోగ,ఉపాధ్యాయ తదితర ఉద్యోగుల పెండింగ్ అంశాల్ని ఎప్పటికప్పుడు సమీక్షించి నెలవారీగా ఉద్యోగులకు వచ్చే ప్రభుత్వపర బెనిఫిట్స్ను పరిష్కరించే దిశలో ఎప్పటికప్పుడు డివిజన్ తహసిల్ స్థాయి ఎస్టీవోల సమావేశాలు నిర్వహించి పెన్షన్ పెన్షన్ ఇతర సమస్యలు బందు వర్గాల్లో వారసత్వ బదిలీలను చేసి కుటుంబాలకు సక్రమమైన విధంగా సేవలందించడం హర్షణయం ముఖ్యంగా స్వయం సహాయక మహిళ గ్రూపులతో పాటు ఐకెపి గ్రామీణ ఉపాధి హామీ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మహిళా సంఘాలలో డ్వాక్రా గ్రూపులను ఏకం చేసి సమీకృతంగా ప్రభుత్వ రుణాలను సకాలంలో అందిస్తున్న మరో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని డిఆర్డిడి ఓ విజయలక్ష్మి ప్రభుత్వ ఋణం బకాయిల రికవరీతోపాటు కొత్తగా కోట్లాది రూపాయల రుణాలను మహిళ గ్రూపులకు అందించి విద్యా, వ్యాపార రంగాల్లో ముందుకు తీసుకురావడంలో ముందున్నారు.కాగా మరో రెవెన్యూ డివిజన్నల్ అధికారిగా రత్న కళ్యాణి ప్రభుత్వ పై అధికారుల ఆదేశానుసారంగా వ్యక్తిగత స్థైర్యంతో ప్రభుత్వ భూములను కాపాడుతూ వారసత్వ ఇతరత్వ కుటుంబాల్లో ఉన్న తగాదా ఇతరత్త సమస్యలభూముల గెట్లు పరిష్కరించడంలో రెవెన్యూ మండల స్థాయి సర్వేయర్లతో సమావేశాలు ఏర్పరిచి రైతులకు అందుబాటులో భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవడం గమనార్హం ఇలా నిర్మల్ జిల్లాలో మహిళ ఉన్నతాధికారులు అతిరత మహారత రాజకీయాల నాయకులకు, పైరవీలకు తావివ్వకుండా సామాన్య ప్రజానీకానికి ప్రభుత్వానికి వారదులుగా ఉంటూ ఆయా శాఖలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న నిజమైన ఉన్నత మహిళ జాతీయ దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా అధికారినిలను అభినందించక తప్పదు.

# ప్రస్తుత కాలంలో విద్యార్థినులు అన్ని రంగాలలో సమున్నత స్థానాలను సాధిస్తూ మహిళా శక్తిని చాటాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ రామాక పాండురంగ శర్మ
- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**మంచిర్యాల,7, మార్చి, (ప్రజాజ్యోతి):** ప్రస్తుత కాలంలో విద్యార్థినులు అన్ని రంగాలలో సమున్నత స్థానాలను సాధిస్తూ మహిళా శక్తిని చాటాలని మం చిర్యాల జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామాక పాండురంగ శర్మ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ముం దస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందర్నీ ఆకట్టుకున్నాయి. మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని కళాశాల అధ్యాపకులను విద్యార్థినులు ఘనంగా సన్మానించారు. టాస్క్‌లో భాగంగా మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు బి. మహేశ్వరి (ఎం.పీ.సీ తృతీయ సంవత్సరం), ఎ.సాత్విక (బి.జెడ్.సి తృతీయ సంవత్సరం)లకు మెమెం టోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరితో పాటు మరో 70 మంది విద్యార్థినులకు కూడా ప్రశంసా పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామాక పాం డురంగ శర్మ ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ మాట్లా డుతూ, ప్రాచీన కాలం నుండి భార తీయ సం స్కృతిలో స్త్రీకి విశిష్టమైన స్థానం కల్పిం చారని తెలిపారు. ప్రస్తుత కాలంలో మహిళలు విద్యతో పాటు అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచి సమున్నత స్థానాలను సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థి నులు కూడా అదే దిశగా ముందుకు సాగి మహిళా శక్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్ర మాన్ని ఎన్ఎస్ఎస్--ఐ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.రజిత, కల్చరల్ కో-ఆర్డినేటర్ కె.సరిత విజయవంతంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ సమాజ బాధ్యత

## రామగుండం పోలీసుల చైల్డ్ సేఫ్టీ, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు







**మంచిర్యాల,7, మార్చి (ప్రజా జ్యోతి) :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో పిల్లల భద్రత, సంరక్షణతో పాటు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలను పోలీసులు నిర్వహించారు. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, వేధింపులు యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం నేపథ్యంలో ఈ కార్యక్రమా లను చేపట్టినట్లు తెలిపారు. పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలకు చిన్నారుల భద్రతకు సంబంధించిన ముఖ్య సూచనలు అందించారు. పిల్లలు ఎలాంటి ప్రమాద పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు ఎలా స్పందించాలి, అపరిచిత వ్యక్తుల నుంచి ఎలా జాగ్రత్తపడాలి, ఆన్‌లైన్‌లో ఎదురయ్యే మోసాలు మరియు సైబర్ ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.అదే విధంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబ మరియు సామాజిక సమస్యల గురించి కూడా వివరించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుంద న్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలన్నారు. పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని,చిన్నారు లపై అనుమానాస్పద సంఘటనలు గమనించి నప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.. అలాగే మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్ సర్పంచ్



**నేరడిగొండ మర్చి 07 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమంలో భాగంగా ఈ రోజు 2వ. రోజు వడూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల రైతు వేదిక, మరియు అంగన్వాడీ, కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత మరియు మరుగుదొడ్ల పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాన్ని అమలు చేయ డమే కాకుండా ఈ అమలును అధ్యయనం చేసి ప్రజా సేవకులను ప్రజాసేవలో పనిచేయడానికి సిద్ధం చేసే విద్యా విభాగం కూడా ప్రజా పరిపాలన అని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ అడేపు శ్రీకాంత్, ఉప సర్పంచ్ ఎరడ్ల మమత, చంద్రశేఖర్ పంచాయితీ సెక్రటరీ సద్దాం,వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి



**ఖానాపూర్ మార్చ్ 7 (ప్రజా జ్యోతి) :** కడెం మండలం కొండుకుర్ గ్రామంలో 10 లక్షలతో వివో భవనం , 10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం, 12 లక్షలతో అంగన్వాడీ భవనాలకు భూమి పూజ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పతకాలు అందుబాటులోకి వస్తున్నాయి అన్నారు . మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత మార్కెట్ కమిటీ చైర్మన్ బుమన్న సతీష్ రెడ్డిసంబంధిత అధికారులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి మంచిర్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

## - పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ





**మంచిర్యాల, 7,మార్చి, (ప్రజాజ్యోతి) :** విద్యార్థులు కష్టపడి చదివి మంచిర్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ లాడ్స్ నిధుల నుంచి 80 లక్షలు మంజూరు చేసి మూడు బస్సులను అందజేసి ఆ బస్సులను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు. గతంలో మెడికల్ కాలేజీని సందర్శించిన సమయంలో విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీ వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ ఎంపీ లాడ్స్ నిధుల నుంచి 80 లక్షలు కేటాయించి మూడు బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గతంలో కాలేజీ సందర్శించినప్పుడు విద్యార్థులు ట్రాన్స్పోర్ట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారని, ఆ సమస్యను పరిష్కరించేందు కు మూడు బస్సులను అందజేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. “విద్య మన హక్కు... విద్యతోనే మన భవిష్యత్” అని ఎంపీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు, మెడికల్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఏరియా సిహెచ్‌పిలో నూతన పిట్ సెక్రటరీ జిల్లాల రవికి ఘన సన్మానం



**మంచిర్యాల, 7, మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సిహెచ్‌పి లో నూతనంగా ఏఐటీయూసీ పిట్ సెక్రటరీగా ఎన్నికైన జిల్లాల రవి ని శ్రీరాంపూర్ బ్రాంచ్ మినిస్ట్రీయల్ వింగ్ తరఫున ఘనంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భం గా జిల్లాల రవి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో, ఉద్యోగస్తుల సంక్షేమంలో ఎల్లవేళలా ముందుండి పనిచేస్తూ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే యూనియన్ ఆర్గనైజేషన్‌ను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా మినిస్ట్రీయల్ వింగ్ ఇంచార్జ్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ఇంటర్నల్ ఆడిట్ పిట్ సెక్రటరీలు రాజు, రాజశేఖర్, సిహెచ్‌పి మినిస్ట్రీయల్ వింగ్ సభ్యులు రాకేష్, సురేష్, కిరణ్, అలాగే యాక్టింగ్ పి.ఏ శ్రీరాములు శ్రీనివాస్ పాల్గొని పిట్ సెక్రటరీ జిల్లాల రవిని ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

# మహిళల పాత్ర సమాజంలో విశిష్టం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కౌన్సిలర్లకు సన్మానం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 7 (ప్రజాజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మహిళా కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత విశిష్టమైందని అన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు మహిళలు తమకు వచ్చిన అవకాశాలను



సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో ప్రతిభ చాటుకుంటున్నారని పేర్కొన్నారు. అటువంటి మహిళలను గౌరవించడం మన సంస్కారానికి ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి, స్వాతి హరిబాబు, అరుణ శ్రీనివాసులు, శిరీష రమేష్ గౌడ్, శంకరమ్మ బాబు నాయక్, అయేషా సిద్ధిఖీ, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, జ్యోతి రమణ పాల్గొన్నారు. అలాగే నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, గంధం పరంజ్యోతి, కౌన్సిలర్లు మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, మదన్, మహేశ్వర్ రెడ్డి, వెంకట్ సాగర్, మంద రాము, హర్షద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మార్చి 7 (ప్రజాజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా





శనివారం వనపర్తి పట్టణంలోని ఎకో పార్క్ సమీపంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా శ్రమదానం చేసి పార్క్ పరిసరాల్లోని చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తదితరులు కూడా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా చురుకుగా పాల్గొని స్వచ్ఛమైన పరిసరాల నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ సీతారాం, సిపిఓ హరికృష్ణ, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సాగునీటి పనులు వేగవంతం చేయాలి

- నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమీక్ష

వనపర్తి ప్రతినిధి, మార్చి 7 (ప్రజాజ్యోతి): నియోజకవర్గ పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, కెనాల్‌లు, పంట కాలువలు, చెక్‌డ్యామ్‌ల పనులను వేగవంతం చేసి పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి



మేఘారెడ్డి నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గట్ల ఖానాపురం రిజర్వాయర్ ఏర్పాటులో ఎదురవుతున్న పలు సమస్యలపై చర్చించారు. అలాగే బుద్ధారం స్టేజ్-2, గణపసముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. రిజర్వాయర్ నిర్మాణాల వల్ల భూములు కోల్పోయే రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఖాన్ చెరువు, ఎంజే-9 కెనాల్, బుద్ధారం ఎడమ కాలువ, ప్యాకేజ్ నెం.27లో నిలిచిపోయిన పనుల పురోగతిపై కూడా అధికారులతో చర్చించారు. నల్ల చెరువు నుంచి అమ్మ చెరువు వరకు వెళ్లే కాలువలను బలోపేతం చేసి త్వరితగతిన బాగు చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్‌కు సంబంధించిన అన్ని పనులను త్వరగా పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సీఈ నాగేంద్రరావు, ఎస్సీ చంద్రశేఖర్, ఈఈ జబేర్ అహ్మద్, డీఈసీ వెంకట్ రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్ ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు గట్టు బ్లాక్ ఎంపిక-జిల్లాకు గర్వకారణం

గద్వాల మార్చి 07(ప్రజా జ్యోతి): నీతి ఆయోగ్ నిర్వహించనున్న ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు జోగులాంబ గద్వాల జిల్లా గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఎంపికైన జిల్లాల్లో వివిధ రంగాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను గుర్తించి ఇతర ప్రాంతాల ప్రతినిధులతో పంచుకునేందుకు ఈ నెల 9న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం-3 పరిధిలో మొత్తం ఆరు రాష్ట్రాలు పాల్గొంటున్నాయని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం నుంచి జోగులాంబ గద్వాల,నిర్మల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషమన్నారు.ఇతర జిల్లాల నుంచి అనేక ప్రతిపాదనలు వచ్చినప్పటికీ గట్టు బ్లాక్‌లో విద్యా రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను సెమినార్‌లో ప్రదర్శించేందుకు గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు.విశాఖపట్నంలో జరిగే ఈ సెమినార్‌లో జోగులాంబ గద్వాల జిల్లా తరపున తాను పాల్గొని గట్టు బ్లాక్‌లో విద్యా రంగంలో సాధించిన పురోగతిపై ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్లు కలెక్టర్



తెలిపారు.జిల్లాలో వెనుకబడిన గట్టు మండలంలో గతంలో విద్యా రంగంలో తక్కువ అక్షరాస్యత,సీడ్ పత్తి క్రాసింగ్ సమయంలో విద్యార్థుల సీజనల్ డ్రాప్‌అవుట్స్,పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, తక్కువ ఫలితాలు వంటి సమస్యలు ప్రధానంగా ఉండేవని చెప్పారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.గత రెండు సంవత్సరాల్లో విద్యా వాలంటీర్ల నియామకం,సాయంత్రం ప్రత్యేక తరగతులు,మాదిరి పరీక్షల నిర్వహణ వంటి కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు.పత్తికోత సమయంలో పిల్లలు పనికి వెళ్లకుండా గట్టు,కేటీ దొడ్డి మండలాల్లో బాల కార్మిక వ్యవస్థను నిరోధించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.అలాగే 9వ నుంచి 12వ,తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్,ప్రేరణాత్మక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలకు తీసుకురావడానికి గ్రామ,మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. భవిష్య భారత్,టీచ్ ఫర్ చేంజ్,ఎంవీ ఫౌండేషన్ తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ఉదయం పోషకాహార కార్యక్రమాలు అమలు చేయడం వలన విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు.విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడమే కాకుండా క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దీంతో పదవ తరగతి ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయని పేర్కొన్నారు.ఈ విజయానికి విద్యాశాఖ ధికారులు,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమిష్టి కృషి కారణమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారానికే... ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

-ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
-ప్రభుత్వ పథకాలను వివరించడమే లక్ష్యం
-99రోజుల యాక్షన్ ప్లాన్‌కు ప్రత్యేక లోగో

నాగర్ కర్నూల్ మార్చి 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. శనివారం అచ్చంపేట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం మూడో సారి ప్రజల్లోకి వెళుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునిపరిష్కరించేందుకు గ్రామ సభల నిర్వహణకు మరోమారు సిద్ధమవుతోంది ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేశారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట చేపటనున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా అచ్చంపేట పట్టణంలో స్థానిక కౌన్సిలర్లు అధికారులతో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి ప్రారంభించిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు లై, పట్టణ అభివృద్ధి తోపాటు పట్టణం పరిశుభ్రంగా




ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కౌన్సిల్ సభ్యులకు మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై ప్రత్యేక లోగో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ లాయర్ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ డి మురళి, కౌన్సిలర్లు తగరం శీను, ఆకుల వెంకటేష్, గౌరీ శంకర్, మాజీ ఎంపీపీ రామనాథం, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి మున్సిపల్ మేనేజర్, ఏఈ రాజా నాయక్ కో ఆప్షన్ ఆప్షన్ మెంబర్లు, మున్సిపాలిటీ అధికారులు నాయకులు కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మహిళల గౌరవం - సమాజ అభివృద్ధికి పునాది

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ దరావత్ జానకి మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు గౌరవం, సమాన హక్కులు మరియు అవకాశాలు లభించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధించగలదని పేర్కొన్నారు. నేటి మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు, రాజకీయాలు వంటి అనేక రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు తమ ఆత్మవిశ్వాసం, పట్టుదల,




సంకల్పంతో ముందుకు సాగితే దేశ అభివృద్ధిలో మరింత భాగస్వాములు అవుతారని తెలిపారు. మహిళల భద్రత, రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని భరోసా ఇచ్చారు. మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో చైతన్యం పెంచేందుకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో షీ టీమ్స్ మరియు కళాజాత బృందాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

ప్రతి మహిళ తన హక్కులు, చట్టాలు మరియు భద్రతకు సంబంధించిన సేవలపై అవగాహన కలిగి ఉండాలని, ధైర్యంగా ముందుకు సాగుతూ తన లక్ష్యాలను సాధించాలని ఎస్పీ జానకి పిలుపునిచ్చారు.

# ఓబీసీలకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉంది : సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్, మార్చి 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ మరియు పరిపాలన వ్యవస్థలో ఓబీసీలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షుడు అనిల్ జైహింద్ ఆధ్వర్యంలో ఓబీసీ సముదాయాల సమస్యలపై కీలక సమావేశం నిర్వహించారు.

తెలంగాణలో ఓబీసీ సముదాయాల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో సంజీవ్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ



సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనా విధానం మేరకు బడుగు, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తన అభిప్రాయాలను సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ రుద్ర సంతోష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీతో సేవ... క్రీడలతో కీర్తి

- మహిళా దినోత్సవం సందర్భంగా కానిస్టేబుల్ రాధిక స్ఫూర్తిదాయక గాథ

మహబూబ్‌నగర్, మార్చి 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ విభాగంలో అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి. రాధిక (పిసి-2405) క్రీడా రంగంలో ప్రతిభ చూపుతూ జిల్లా పోలీస్ శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మహిళా పోలీసుగా నిలిచారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె సాధించిన విజయాలు ఇతర మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

రాధిక 2010 ఆగస్టు 27న మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు విభాగంలో ఉమెన్ కానిస్టేబుల్‌గా సేవలను ప్రారంభించారు. అప్పటి నుంచి విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూనే క్రీడల పట్ల ఆసక్తిని కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరుస్తూ అనేక పతకాలు సాధించారు. ముఖ్యంగా హ్యాండ్‌బాల్ క్రీడలో పలుమార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల సైబరాబాద్‌లో నిర్వహించిన నాలుగవ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఆర్మ్ రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. అలాగే 2019 జనవరి 6 నుండి 11 వరకు మహారాష్ట్రలోని సోలాపూర్‌లో జరిగిన సీనియర్ ఉమెన్స్ హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలలో పాల్గొన్నారు. డిసెంబర్ 22 నుండి 27 వరకు ఢిల్లీలో జరిగిన సీనియర్ ఉమెన్స్ హ్యాండ్‌బాల్ నేషనల్ పోటీలలో కూడా రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించారు. 2023 మార్చి 15 నుండి 19 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సీనియర్ ఉమెన్స్ హ్యాండ్‌బాల్ నేషనల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన రాధిక, 2024 మార్చి 7 నుండి 12 వరకు అదే రాష్ట్రంలో నిర్వహించిన పోటీలలో కూడా పాల్గొని తన క్రీడా ప్రతిభను చాటారు. అంతేకాకుండా 2025 జనవరి 28




నుండి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో జరిగిన మూడవ తెలంగాణ స్టేట్ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఆర్మ్ రెజ్లింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన 74వ ఆల్ ఇండియా రెజ్లింగ్ క్లస్టర్ పోటీలలో హర్యానా రాష్ట్రం కర్నాల్ జిల్లా మధుబన్‌లో సెప్టెంబర్ 20 నుండి 24 వరకు జరిగిన పోటీలలో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించారు. పోలీస్ విభాగంలో చేరకముందే వరుసగా ఆరు సంవత్సరాలు జూనియర్ హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచారు. పోలీసు విధులు నిర్వహిస్తూ క్రీడలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ రాధిక ఇతర మహిళా పోలీసులకు, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కష్టపడి సాధిస్తే మహిళలు ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలరని ఆమె నిరూపిస్తున్నారని జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాధిక సాధించిన విజయాలు జిల్లాలోని మహిళలకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

-పిహెచ్ సి పరిశుభ్రతపై వైద్యులపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆగ్రహం

నాగర్ కర్నూల్ మార్చి 7( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) శనివారం తెల్కపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న అపరిశుభ్రతను గమనించిన జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో తొలి థీమ్‌గా చేపట్టాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలు ఎందుకు నిర్వహించలేదని వైద్యులను జిల్లా





కలెక్టర్ ప్రశ్నించారు. ఒక రోజు ముందుగానే పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అమలు చేయకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అధికారులు ఉదాసీనంగా ఉండొద్దని, 99 రోజుల తర్వాత పనిచేసిన వారికి ప్రశంసలు ఉంటాయని, పనిచేయని వారికి చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో పరిశుభ్రత కీలకమని పేర్కొన్నారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను సందర్శించి వాటి పనితీరుపై సంబంధిత వైద్య, ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు. సాయంత్రం మరోసారి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తానని, అప్పటివరకు పరిశుభ్రత కార్యక్రమాలను పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, వైద్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం




అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మార్చి 07: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులతో కలసి గ్రామాలలో పరిశుభ్రత పనులు గ్రామాల్లో పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు.శనివారం అలంపూర్ మండలం కాశపురం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని గ్రామ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని అధికారులు, సిబ్బంది గ్రామస్థులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాలలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా క్రమబద్ధంగా నిర్వహించడం ద్వారా స్వచ్ఛమైన గ్రామ వాతావరణాన్ని కొనసాగించాలని గ్రామస్థులకు తెలియజేశారు.అదేవిధంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతినిధులు గ్రామస్థులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అన్నారు.గ్రామ పంచాయతీ,అంగన్వాడి కేంద్రాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అలంపూర్ మండల ఎంపీడీఓ పద్మావతి,స్థానిక అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు,అంగన్‌వాడి సిబ్బంది,ఉపాధ్యాయులు,మహిళా సంఘాల సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులపై దూసుకెళ్లిన లారీ

### పలువురికి గాయాలు



**హసన్‌పర్తి, మార్చి 7 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలం భీమారం బస్ స్టాప్ వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో అదుపుతప్పిన లారీ ఒక ఆటోను ఢీకొనగా అక్కడే పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు గాయపడ్డారు. ప్రమాదంలో కన్నం రాణి కాలు తీవ్రంగా దెబ్బతిన్నది. మంద విక్టోరియాకు గాయాలు కాగా, ఆటో నడిపిస్తున్న గుల్ల జనార్ధన్‌కు ఎడమ చేయి విరిగినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న కేయుసి 108 అంబులెన్సు సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ సురేష్, పైలట్ కోటిలింగం ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేస్తూ వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కేయుసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామిని దర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**హసన్ పర్తి, మార్చి 7 (ప్రజాజ్యోతి) :** శ్రీ శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కుడా అధ్యక్షులు ఇనుగాల వెంకటరామి రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జాతర కమిటీ అధ్యక్షుడు మర్కరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి తదితర నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్త తొలగింపు పరిక్రియను పక్కాగా చేపట్టాలని సూచించారు. అలాగే రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతమైన విద్య భవిష్యత్‌కి పునాది

- విద్యార్థినులు లక్ష్యానికి అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** విద్యార్థినులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకొని, అందుకు అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. జిల్లాలోని చౌడారం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థినుల వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత వంటి అంశాలను పర్యవేక్షించారు. అలాగే ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. వారి బోధన సామర్థ్యాలను పరీక్షించి పలు ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా గణితంపై పట్టు సాధించాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, విద్యార్థినులకు మంచి వాతావరణంలో బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థినులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్‌ఓ రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు రాగి జావా.. ప్రగతి నమోదు రిజిస్టర్ల పంపిణీ..



**పర్వతగిరి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రాగి జావా, బెల్లం మరియు విద్యార్థుల సమగ్ర ప్రగతిని నమోదు చేసే ప్రగతి నమోదు రిజిస్టర్లను పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.బిక్షపతి తెలిపారు. పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా పాఠశాలలకు ఈ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు అదనంగా రాగి జావా అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని నమోదు చేసేందుకు సమగ్ర ప్రగతి పత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతి, ఇతర ప్రతిభా అంశాలను ఉపాధ్యాయులు నమోదు చేయగలరని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నదని పేర్కొంటూ, తల్లిదండ్రులు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది గారె జయరాజ్, బాసాని లోకేష్, ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు, మహంకాళి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి జాతర గీత ఆవిష్కరణ

### రచయితను అభినందించిన ఎమ్మెల్యే



**హసన్ పర్తి, మార్చి 7 (ప్రజాజ్యోతి) :** ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓదెల నరేందర్ రచించిన జాతర గీతాన్ని వర్ధన్నపేట శాసనసభ్యుడు కె.ఆర్. నాగరాజు ఎర్రగట్టు దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర చరిత్రను, ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి మహిమను, జాతర జరిగే విధానాన్ని ఎంతో చక్కగా వివరిస్తూ గీతాన్ని రచించిన ఓదెల నరేందర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు మార్త రాజు, స్థానిక నాయకులు వీసం సురేందర్ రెడ్డి, కనపర్తి కిరణ్, మేకల ఆనంద్, పెద్దమ్మ నరసింహ రాములు, రాకేష్ రెడ్డి, అయ్యగార్లు పార్థసారథి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. గీత నిర్మాణానికి సహకరించిన గుండమీది కృష్ణమోహన్, చెంగెల్లి నరేష్, కాజీపేట అన్నమాచార్య, శీలం తేజ తదితరులు హాజరయ్యారు. మరో కార్యక్రమంలో 66వ విభాగ ప్రతినిధి గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విశేష పండుగలు, సమకాలీన సామాజిక అంశాలు, విద్య ప్రాధాన్యతపై గీతాలను రచిస్తున్న ఓదెల నరేందర్‌ను అభినందించారు. ఇలాంటి గీతాలను మరింతగా రచించాలని సూచించారు. ఈ గీతాన్ని విన్న భక్తులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ గీతం నరేన్ క్రియేషన్స్ అనే యూట్యూబ్ చానెల్ లో అందుబాటులో ఉందని తెలిపారు.

## ములుగు మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా

- అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీనీ అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని,అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని పంచాయతీరాజ్,గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో శనివారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశామని,పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ.15 కోట్ల రూపాయలతో టెండర్లు జరిగాయని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా,5వ వార్డు కౌన్సిలర్ గుగ్గిళ్ళ దివ్య సుజన్,వివిధ వార్డుల కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ భూమికి బేరం.. అన్నారంలో లక్షల డీల్ బట్టబయలు..!

- సర్వే నం.489లో అక్రమ అమ్మకాలు..
- నిర్మాణాలపై కేసులు, కూల్చివేతలు..
- ఇది మొదలే ఇక జరిగేదంతా ముందే ఉంది అక్రమ నిర్వాహకులకు తహసిల్దార్ హెచ్చరిక





**పర్వతగిరి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలో ప్రభుత్వ భూమిని లక్షల్లో అమ్ముకున్న వ్యవహారం బయటపడడంతో సంచలనం రేగింది. గ్రామంలోని సర్వే నెంబర్ 489లో ఉన్న ప్రభుత్వ భూమిని అన్నారం గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ మోటుపతుల సారంగపాణి మరియు ఆడెపు యమేశ్వర్ అనే ఇద్దరు వ్యక్తులు వరుసగా రూ.4 లక్షలు, రూ.3 లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు అక్కడ నిర్మాణాలు ప్రారంభించడంతో విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన పర్వతగిరి తహశీల్దార్ వెంకటస్వామి అన్నారం గ్రామాన్ని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. పరిశీలనలో సర్వే నెంబర్ 489లోని భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి అని తేలడంతో అధికారులు కఠినంగా స్పందించారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడం, కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేస్తూ, అక్కడ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కేసులు నమోదు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇక పై ఇలాంటి దుస్సహసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, నిర్మాణాలను సైతం కూల్చివేస్తామని తహశీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమ లావాదేవీలు జరిగినా రెవెన్యూ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. అన్నారం గ్రామంలో జరిగిన ఈ వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఉద్యమకారులను సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు...



**పర్వతగిరి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలం కేంద్రానికి చెందిన ముదురకొల నాగరాజును ఇటీవల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా పర్వతగిరి మండల అధ్యక్షులుగా గరుగు రాజు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పిన్నింటి అనిల్ రావు మాట్లాడుతూ ఉద్యమకారుల హక్కుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.త్వరలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుటకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం త్వరలో అసెంబ్లీ లో గొప్ప నిర్ణయం తీసుకోనున్నారని పర్వతగిరి మండలానికి వర్ధన్నపేట నియోజక వర్గానికి పెద్దపీట వేస్తారని దానికోసం స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అహర్నిశలు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పిన్నింటి సునీల్ రావు,నరెడ్ల సంతోష్, ఉద్యమకారులు నాగుల రాజులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మత్తులో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

– ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయి – అప్రమత్తంగా ఉండాలి పసర ఎస్సై తాజుద్దీన్





**గోవిందరావుపేట/ములుగు స్టాఫ్ రిపోర్టర్ ప్రజా జ్యోతి మార్చి 7 :** యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పసర పోలీస్ వారి ఆధ్వర్యంలో లారీ డ్రైవర్స్. ఆటో డ్రైవర్. డీసీఎం డ్రైవర్స్ యజమానులతో డ్రగ్స్. రోడ్ సేఫ్టీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ సుధీర్ ఆదేశాల మేరకు, ములుగు డీఎస్పీ కిషోర్ కుమార్ మార్గదర్శకత్వంలో, పసర సీఐ దయాకర్ సూచనలతో పస్ర ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు, క్రీడలు మరియు మంచి అలవాట్ల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్య సూచనలు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. పాఠశాలలు, కళాశాలల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాశీ. యువత తమ భవిష్యత్తును కాపాడుకోవాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరియు వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. ముఖ్య సూచనలు హైవేపై లెఫ్ట్ సైడ్‌లో భారీ వాహనాలు నిలపరాదుమద్యం సేవించి వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు మరియు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయరాదు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదు. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ తాజుద్దీన్. ఎస్సై నాగరాజు. ఏ ఎస్సై నరోత్తమ రెడ్డి. హెడ్ కానిస్టేబుల్ రవి నాయక్. లారీ అసోసియేషన్ యూనియన్ నాయకులు శ్రీనివాస్. పస్రా గోవిందరావుపేట. చల్వాయి. ఆటో. లారీ. డీసీఎం. డ్రైవర్స్ యజమానులు స్థానిక ప్రజలు, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.

## నిరుపేద బాధిత కుటుంబానికి బియ్యం సహాయం



**దామెర, మార్చి 07 (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు కందుగుల సారయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి సహాయం అందజేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకుడు బండి సతీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సారయ్య కుమారులు సదయ్య, కుమారస్వామి (గ్రామపంచాయితీ కార్మికుడు)లను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యం అందజేశారు. ఇలాంటి సమయంలో అందరూ మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలెపాక రమేష్, పోలెపాక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని ఎమ్మెల్యేను కోరిన కాంగ్రెస్ నాయకులు



**హసన్‌పర్తి, మార్చి 7 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరుతూ హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజును శనివారం కలిశారు.ఈ సందర్భంగా గ్రామంలో నిజమైన అర్హులకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. సమస్యను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, నాలుగో వార్డు సభ్యుడు సౌరం యాదగిరి, సౌరవ్ సుమలత సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు కొయ్యడ విజయ్, సౌరం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

– జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ములుగు జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు సూచించారు. ప్రజాపాలన – ప్రగతి పథం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పాటశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య వస్తుందని అందుకు పౌష్టికాహారాం తీసుకోవాలని సూచించారు.పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు జనరల్ పిజిషన్ మనోజ్ లాల్,పిల్లల వైద్య నిపుణుడు వంశీకృష్ణ,స్రవంతి,కంటి వైద్య నిపుణుడు ప్రవీణ్ రెడ్డి,సుజిత,దంత వైద్యురాలు నికిత,ఆర్బీ ఎస్కే వైద్యుడు మల్లి కార్జున్,సుజాత,పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జీవన్ ప్రియ, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలకేంద్రంలో(32)మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి షాదీ ముభారక్ చెక్కులను శనివారం పంచాయతీ రాజ్ స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)సంపత్ రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్,ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, వెంకటాపూర్ మండల తహశీల్దార్ బి.గిరిబాబు, వెంకటాపూర్ మండల ఎంపిడిఓ మూడ్ రాజు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## కొత్త చెరువు పరిధిలో కోర్టు భవనం నిర్మాణం వద్దని న్యాయవాదుల వినతి

ఆలేరు మార్చి 7 ప్రజా జ్యోతి:
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ప్రతిపాదించిన నూతన కోర్టు భవనం నిర్మాణ స్థలం కొత్త చెరువు పరిధిలో ఉందని పేర్కొంటూ, ఆ స్థలంలో నిర్మాణం చేపట్టకూడదని బార్ అసోసియేషన్ న్యాయవాదులు తహసీల్దార్ ఆంజనేయులు శనివారం వినతిపత్రం అందించారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్లు 1026, 1033, 1034 ప్రాంతాల్లో ఉన్న స్థలం కొత్త చెరువు అంచుకు చెందినదని, ఆ ప్రాంతంలో కోర్టు భవనం నిర్మాణం చేపడితే చెరువు సరిహద్దులకు నష్టం కలిగే అవకాశం ఉందని న్యాయవాదులు తెలిపారు. అందువల్ల ముందుగా కొత్త చెరువు సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించి, కోర్టు భవన నిర్మాణానికి అనువైన మరో స్థలాన్ని చూపించాలని వారు కోరారు. చెరువు పరిధిలో ఉన్న కొన్ని భూములను ప్లాట్లుగా చేసి విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ విషయంపై కూడా సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు తమ వినతిలో పేర్కొన్నారు.ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి చెరువు పరిధికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ కె వి ప్రసాద్,తోటకూరి రాజు, సామల రమేష్, శ్రీనివాస్, శివకుమార్ తదితర బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేర్చేది విద్యే

### తుంగతుర్తి తహసిల్దార్ దయానందం

తుంగతుర్తి, మార్చి 7,(ప్రజా జ్యోతి):
విద్య ప్రతి వ్యక్తి జీవితాన్ని మారుస్తూ ఉన్నత స్థానానికి చేర్చే గొప్ప సాధనమని తుంగతుర్తి తహసిల్దార్ దయానందం అభిప్రాయపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మరియు కస్తూర్బా గాంధీ పాఠశాలలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాస్ట్




మినిట్ రివిజన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాలలో ఎమ్మార్వో దయానందం హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. చదువు ద్వారా జ్ఞానం పెంపొందించుకొని సమాజంలో గౌరవం సంపాదించవచ్చని పేర్కొన్నారు. కష్టపడి చదివి మంచి లక్ష్యాలను సాధిస్తే భౌతిక బంగారంగా మారుతుందని విద్యార్థులకు సూచించారు. చదువుతో మనిషి వ్యక్తిత్వం వికసించడమే కాకుండా సమాజాభివృద్ధికి బలమైన పునాది పడుతుందనీ, విద్య ఉన్నచోట అవగాహన ఉంటుందని, అవగాహన ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని అన్నారు. విద్య మనిషికి కేవలం ఉద్యోగ అవకాశాల కోసమే కాదని మంచిని చెడును గుర్తించే వివేకాన్ని కూడా ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగరావు ను అభినందించారు. అనంతరం ఎస్సై క్రాంతి కుమార్,పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు లు మాట్లాడుతూ... విద్యతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని విద్య మనిషిని అంధకారంలో నుంచి వెలుగు వైపు నడిపించే మార్గదర్శి అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి రాజారామ్, నల్ల రాజు సతీష్ కుమార్, కోట రామస్వామి , మనోజ్ కుమార్,ఉపాధ్యాయులు భాస్కర్, యాకయ్య, రాజన్న వసంత తదితర ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు పచ్చ రోశయ్య

### పచ్చ రోశయ్య మృతి కోదాడ పబ్లిక్ క్లబ్ కు తీరని లోటు

కోదాడ టౌన్,మార్చి 07 ( ప్రజా జ్యోతి):
కోదాడ పబ్లిక్ క్లబ్ శాశ్వత సభ్యుడు పచ్చ రోశయ్య మృతి బాధాకర మని క్లబ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గాయం పట్టాభి రెడ్డి, బొల్లు





రాంబాబు లు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయన సంతాప సభలో క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, నిబద్ధతతో సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. గత 40 సంవత్సరాలుగా క్లబ్ సభ్యులతో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేనేపల్లి సత్యనారాయణ, వేణుగోపాలరావు, కారు మంచి సత్యనారాయణ, వేనేపల్లి వెంకటేశ్వరరావు, చింతలపాటి శ్రీనివాసరావు, ఎయిర్ ఫోర్స్ వెంకట్ రెడ్డి, కొత్త బ్రహ్మయ్య, కత్రం సీతారాం రెడ్డి, పట్టణ ప్రముఖులు, క్లబ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో ఈనెల 9 నుండి జాతీయస్థాయి పద్య నాటక,సాంఘిక నాటిక పోటీలు

మిర్యాలగూడ, మార్చి 07, ( ప్రజాజ్యోతి ):
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్.డి.సి. మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం సంయుక్తంగానిర్వహిస్తున్న జాతీయస్థాయి పద్య నాటక, సాంఘిక నాటిక పోటీలు, నృత్యోత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించ నున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రామచంద్రరావు, అధ్యక్షుడు పి. రామావ తారం, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, కోశాధికారి పి వెంకటలక్ష్మి నారాయణ శర్మ లు తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణం లోని మినీరవీంద్ర భారతి ఆడిటోరియం వద్ద ఏర్పాట్లు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల తోపాటు ప్రతిభ కనబరిచిన కళాకారులకు నందిని అవార్డ్స్ – 2026 అందజేయనున్నామని తెలిపారు. ఈనెల 9వ తేదీ (సోమవారం) రోజున ఉదయం 10 గంటలకు నృత్యోత్సవాలు, మధ్యాహ్నం 3 గంటలకు కళ్యాణ మండోదరి పద్య నాటకం మహబూబ్ నగర్ జిల్లా నవజ్యోతి కళామండలి జడ్చర్ల వారిచే ప్రదర్శించ బడుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభంతడకమళ్ళ రామచంద్ర రావు రచించిన నాటకాల అవిష్కరణ, రాత్రి 7 గంటలకు త్యాగ శ్యామ దీక్ష తార్ ఆరాధన సప్తహంలో భాగంగా ఎన్ సి ఆర్ సంగీత పరిషత్ ద్వారా సంగీత్ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు వారుతెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకునృత్యోత్స వాలు, మధ్యాహ్నం 2:30 గంటలకు శివ లీలలు పద్య నాటకం, కడప



జిల్లా పొద్దుటూరు శ్రీ వెంకట సాయివెలుగు కళాకారుల సమాజం సాయంత్రం 5 గంటలకు ఎవరు సాంఘిక నాటిక గుంటూరు జిల్లా తెనాలి అద్దేపల్లి ఆరాధ్య ఆర్ట్స్ వారిచే ప్రదర్శించబడు తుందన్నారు. సాయంత్రం 6 :30 గంటలకు తరమెల్లి పోతున్నది సాంఘిక నాటిక గుంటూరు జిల్లా శ్రీ కరుణం సురేష్ మెమోరియల్ థియేటర్ వారిచే,రాత్రి 8 గంటలకు ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక గుంటూరు జిల్లా అభినయ ఆర్ట్స్ వారిచే ప్రదర్శించబడుతుంద న్నారు. ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు పాటల పోటీలు మధ్యాహ్నం 3:00 గంటలకు భక్త ప్రహ్లాద పద్యం నాటిక హైదరాబాద్ నవక్రాంతి కల్చర్ అసోసియేషన్ సాయంత్రం 6 గంటలకు ఉరి సాంఘిక నాటిక వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు. రాత్రి 7:15 గంటల కువేదాంతం సాంఘిక నాటిక శ్రీ షిరిడి సాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్అనకాపల్లి, రాత్రి 8:15 గంటలకు సాంఘిక నాటిక జీవీకే క్రియేషన్స్ కాకినాడ. ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు పాటల పోటీలు మధ్యాహ్నం 2:00 గంటలకు చెరిగిపోని చిరునామా సాంఘిక నాటిక హర్ష క్రియేషన్స్ విజయవాడ.మధ్యాహ్నం 3:30 గంటలకుత్యాగశీలి దాదిచి మహర్షి పద్య నాటకం టిబిఆర్ హైదరాబాద్. రాత్రి 7:00 గంటలకు నీళ్లు సాంఘిక నాటిక నటరాజ డ్రామాటిక అసోసియేషన్ పెందుర్తి విశాఖపట్నం. రాత్రి 8:15 గంటలకు వివాహ బంధం సాంఘిక నాటిక మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వరంగల్, ఈనెల 13న ఉదయం 10 గంటల కునృత్యోత్సవాలు,మధ్యాహ్నం 3 గంటలకు మోహిని భస్మసురా పద్య నాటకం అక్కినేని సాంస్కృతిక సమాజం విజయనగరం సాయంత్రం 6:00 గంటలకు గేమ్ సాంఘిక నాటిక సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్. సాయంత్రం 7:15 గంటలకు అమ్మ చెక్కిన బొమ్మ సాంఘిక నాటిక గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్. ఈనెల 14 ఉదయం 10 గంటలకు నృత్యోత్సవాలు మధ్యాహ్నం 3:00 గంటలకు శ్రీ ఖడ్గ తిక్కన్న పద్య నాటకం డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబానాట్యమండలి విజయవాడ. రాత్రి 7:00 గంటలకు ఇది కొత్త కథ సాంఘిక నాటిక డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ. ఈనెల 15 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు సై సైరా నరసింహారెడ్డి పద్య నాటకం టి జి వి కళాక్షేత్రం కర్నూల్ మధ్యాహ్నం 2: 30 గంటలకు ఎంతిర్పు సాంఘిక నాటిక రౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్ గ్రామం పెద్ద మేరంగి పార్వతీపురం మన్యం జిల్లా. మధ్యాహ్నం 3:30 గంటలకు స్త్రీ సూక్తం పద్య నాటకం శ్యామలాంబ ఫైనాన్స్ అసోసియేషన్ హైదరాబాద్. రాత్రి 7:00 గంటలకు ముగింపు సభ బహుమతుల ప్రధానోత్సవంతో పాటు నందిని అవార్డ్స్ 2026 ఉత్తమ కళాకారులకు బహుకరించ నున్నట్లు నిర్వాహకులుపేర్కొన్నారు. ప్రేక్షకులు వేలసంఖ్య లో పాల్గొని నాటక, నాటిక పోటీలు జయప్రదం చేయాలని వారు కోరారు.గంటలకు నృత్యోత్సవాలు, మధ్యాహ్నం 3 గంటలకు మోహిని భస్మసురా పద్య నాటకం అక్కినేని సాంస్కృతిక సమాజం విజయనగరంసాయంత్రం 6:00 గంటలకు గేమ్ సాంఘిక నాటిక సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్. సాయంత్రం 7:15 గంటలకు అమ్మ చెక్కిన బొమ్మ సాంఘిక నాటిక గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్. ఈనెల 14 ఉదయం 10 గంటలకు నృత్యోత్సవాలు మధ్యాహ్నం 3:00 గంటలకు శ్రీ ఖడ్గ తిక్కన్న పద్య నాటకం డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబానాట్యమండలి విజయవాడ. రాత్రి 7:00 గంటలకు ఇది కొత్త కథ సాంఘిక నాటిక డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ.

ఈనెల 15 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు సై సైరా నరసింహారెడ్డి పద్య నాటకం టి జి వి కళాక్షేత్రం కర్నూల్ మధ్యాహ్నం 2: 30 గంటలకు ఎంతిర్పు సాంఘిక నాటిక రౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్ గ్రామం పెద్ద మేరంగి పార్వతీపురం మన్యం జిల్లా. మధ్యాహ్నం 3:30 గంటలకు స్త్రీ సూక్తం పద్య నాటకం శ్యామలాంబ ఫైనాన్స్ అసోసియేషన్ హైదరాబాద్. రాత్రి 7:00 గంటలకు ముగింపు సభ బహుమతుల ప్రధానోత్సవంతో పాటు నందిని అవార్డ్స్ 2026 ఉత్తమ కళాకారులకు బహుకరించ నున్నట్లు నిర్వాహకులుపేర్కొన్నారు. ప్రేక్షకులు వేలసంఖ్య లో పాల్గొని నాటక, నాటిక పోటీలు జయప్రదం చేయాలని వారు కోరారు.

## పెన్షనర్ల సామాజిక సేవ అభినందనీయం

### వైద్యం వ్యాపారం లా కాకుండా సేవా దృక్పథంతో చూడాలి

### పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

కోదాడ టౌన్, మార్చి 07 (ప్రజా జ్యోతి):
సమాజానికి తమ వంతుగా సేవ చేయాలనే తపనతో కోదాడ ప్రాంత ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు





చేయడం అభినందనీయమని కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు అన్నారు.
శనివారం కోదాడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాస రావు అధ్యక్షతన యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య స్థానిక 19వ వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డిలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్య, వైద్యం వ్యాపారంలా మారి సామాన్యుడికి అందుబాటులో లేని ఈ రోజుల్లో కార్పొరేట్ వైద్యులచే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి కోదాడ ప్రాంత ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.వైద్యో నారాయణో హరి వైద్యాన్ని వ్యాపారంలా కాకుండా సేవా దృక్పథంతో చూడాలన్నారు. కాగా ఈ హెల్త్ క్యాంప్‌లో సుమారు 300 మంది రోగులు పాల్గొని తమ ఆరోగ్య సమస్యలపై వైద్యులను సంప్రదించారు.
ఈ సందర్భంగా వైద్యులు అభిషేక్ బార్లీ, కార్తీక్ కృష్ణ,అనిల్ చంద్ర, వల్ల రాకేష్ రెడ్డి వైద్య బృందం సభ్యులను శాలువా, మెమొంటాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ కార్యదర్శి రఘువర ప్రసాద్, జానయ్య ఎస్ దాని భ్రమరాంబా బిక్షం వెంకటరెడ్డి, శంబయ్య, రవీంద్రనాథ్ ఠాగూర్ విద్యాసాగర్, జగన్మోహన్ రావు,బాలేమియా, గురవయ్య, సత్యనారాయణ, నర్సిరెడ్డి, లక్ష్మీ నరసయ్య, హసన్ జానీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీజీ లో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

### స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవం

### చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

నాంపల్లి,మార్చి,07(ప్రజా జ్యోతి):
విద్యార్థులకు స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవను



నిర్వహించినట్లు నాంపల్లి మండల కేంద్రంలోని స్థానిక గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం నాడు నాంపల్లి గాంధీజీ విద్యాసంస్థలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఒక్కరోజు పాలనలో విద్యార్థులు నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలుగా పెద్ద కాన్వాయ్ గా నాంపల్లి పట్టణ వీధుల్లో తిరుగుతూ... ప్రజలను పలకరించడంతో నిజంగా ముఖ్యమంత్రి మరియు మంత్రులు నాంపల్లి కి వచ్చారా అన్నట్లుగా ప్రజలందరూ ఎంతో ఆసక్తితో తిలకించారు. అంగడి బజార్లో తెలంగాణ తల్లికి, చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కలెక్టర్, డీఈవో, ఎంఈఓ లుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. స్వపరిపాలన దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులను అందించారు.ఈ స్వపరిపాలన దినోత్సవం లో సీఎంగా కర్నాటి కార్తీక్, డిప్యూటీ సీఎం వీ ధనుష్, పి వైష్ణవి, శాసనసభ స్పీకర్ గా కర్నాటి భువన, రాష్ట్ర గవర్నర్ కే. భవ్య శ్రీ, మాజీ సీఎం కేసీఆర్ గా వి.చరణ్, మంత్రులుగా ఎండి సుహాన, వి శ్రీజ, డి శ్రీజ, ఎన్ అక్షిత, కె. నికిత, డి రాజేశ్వరి, రూప శ్రీ ఏ వర్షిని ,ఎం రమ్య, ఎమ్మెల్యేగా ఏ అరవిందు, ఎం యశ్వంతు, చరణ్ రెడ్డి, బి శివ, కలెక్టర్ గా కే.సంధ్య, డీఈవోగా ఎన్ సాయి హర్షిత, ఎమ్మార్వో ఈ అభిలాష్, కరస్పాండెంటుగా కె.రోహిత్, హెచ్ఎం గా ఏ అఖిల్, తమ తమ పాత్రలను పోషించారు.
ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్స్ సామల వెంకటేశం, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### మహిళా విద్యతోనే సమాజానికి మేలు

### సీనియర్ సివిల్ జడ్జి సురేష్

### మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

కోదాడ టౌన్, మార్చి 07 (ప్రజా జ్యోతి):
మహిళా విద్యతోనే సమాజానికి మేలు జరుగుతుందని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోదాడ కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా



నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యంగా భారతదేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వంటి వారు దేశాన్ని శక్తివంతంగా మారుస్తున్నారని పేర్కొన్నారు. చట్టసభలు, సైనిక మరియు న్యాయ వ్యవస్థల్లో మహిళలకు సమాన వాటా లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్. రామకృష్ణ, మహిళా ప్రతినిధి ధనలక్ష్మి , న్యాయవాదులు హేమలత, శిల్ప, కోర్టు సూపరింటెండెంట్ రజిని, సీనియర్ న్యాయవాదులు పద్మ,రంగారావు, గట్ల నరసింహారావు,శరత్ బాబు, రాజన్న, దావీదు, రామ్ రెడ్డి, గోవర్ధన్, మందా వెంకటేశ్వర్లు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా,మార్చి7(ప్రజాజ్యోతి)
మహిళలు అన్ని రంగాలలో రాణించాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.శనివారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా కౌన్సిలర్లు స్వయం




సహాయక సంఘాలు మహిళా ఉద్యోగులు మహిళా పాలశుధ్య సిబ్బందిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళల అభ్యున్నతి సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు.ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్ లు నకిరేకంటి అన్నపూర్ణ, చిట్టిప్రోలు శ్రీదేవి,గౌహర్ జబీన్, చేరుపల్లి ముత్యాలు,టిఎంసి పద్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు,రిసోర్స్ పర్సన్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉప్లూర్ గ్రామంలో రెండవ రోజు ప్రజా పాలన

– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు



కమ్మర్ పల్లి మార్చ్ 7,ప్రజా జ్యోతి. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రెండవ రోజు కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయడం జరిగింది, అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో భాగంగా ప్రజల సంక్షేమం పర్యావరణ పరిరక్షణకు కోసం ఎనలేని కృషి చేసి ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం కృషి చేస్తుంది అన్నారు ,ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి ఎంపీడీఓ రాజా శ్రీనివాస్, ఎంపిఓ సదాశివం ఎపిఓ వివేకానంద, కార్యదర్శి రాఘవేందర్,పాఠశాల హెడ్ మాస్టర్ రాజన్న ,గిరిధర్ ,వార్డ్ మెంబెర్ రాకేష్ నాయకులు నరేష్ ఎఫ్ఏ అశ్వపతి పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# ఇందల్వాయి తాండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ సుదర్శన్ నాయక్



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్) మార్చ్. 7 ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి తండా గ్రామపంచాయతీలో ప్రణాళిక కార్యక్రమాలప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోజు ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి తాండ గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయడం జరిగింది, అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుదర్శన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో భాగంగా ప్రజల సంక్షేమం పర్యావరణ పరిరక్షణకు కోసం ఎనలేని కృషి చేసి ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం కృషి చేస్తుంది అన్నారు ,ఈ కార్యక్రమంలో ఇందల్వాయి సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు సుదర్శన్ నాయక్ , స్కూల్ టీచర్లు ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు కార్యదర్శి ,పాఠశాల హెడ్ మాస్టర్ ,వార్డ్ మెంబెర్ నాయకులు ఎఫ్ఏ పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయి టోల్ ప్లాజా

# వద్ద నూతన సర్పంచులకు సన్మానం





ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్ ) మార్చ్.7 నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులను మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వారికి అభినందన తెలుపుతూ గ్రామల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజల సేవే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి పేదలు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారానికి ముందుండాలని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు. అట్లాగే రైతులను అధికారులు లెక్కచేయని ప్రభుత్వం ఈరోజు ఎక్కడుందో మీ అందరికీ తెలుసు అని ఆయన గుర్తు చేశారు. ప్రజాసేవలో నిబద్ధతతో పని చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండల అధ్యక్షులు నల్లవెల్లి సర్పంచ్ చంద్రాయన పల్లి సర్పంచ్ ఇందల్వాయి సర్పంచ్ బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్





ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్) మార్చ్. 7 ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా గ్రామపంచాయతీలో ప్రణాళిక కార్యక్రమాల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు ఇందల్వాయి మండలంలోని గంగారం తాండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయడం జరిగింది, అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో భాగంగా ప్రజల సంక్షేమం పర్యావరణ పరిరక్షణకు కోసం ఎనలేని కృషి చేసి ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం కృషి చేస్తుంది అన్నారు ,ఈ కార్యక్రమంలో గంగారం తండా సర్పంచ్ సంగీత దిలీప్ నాయక్ , స్కూల్ టీచర్లు ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు కార్యదర్శి , శ్రీధర్ హెడ్ మాస్టర్ ,వార్డ్ మెంబెర్ బుజ్జి మమత నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్ రవి. ఆశ వర్కర్ జ్యోతి పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను

# ప్రశాంత వాతావరణంలో రాయండి



కమ్మర్‌పల్లి మార్చ్ 7,ప్రజా జ్యోతి. మార్చి 14 నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయాలని రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత ,కోరుట్ల మండలం ఎకిన్ పూర్ పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ మార్గం రాజేంద్రప్రసాద్ తెలిపారు. కమ్మరి పల్లి మం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థులకు శనివారం వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. ఎక్కువ శాతం విద్యార్థులు ప్రశ్న పత్రం ఇచ్చిన ఐదు నిమిషాలలో జవాబులు రాయడం మొదలు పెడతారు. అలాకాకుండా ప్రశ్నల్ని పూర్తిగా చదివి అడిగిన ప్రశ్నకు ఎన్ని మార్కులు జవాబు ఎలా రాయాలి ఎంత మేర రాయాలి అని ఆలోచించి రాయాలి . కష్టపత్రంలో సరైన సమాధానం రాయగలమన్న నమ్మకం ఉన్న ఏ ప్రశ్నకైనా ముందు సమాధానం రాయాలి. కష్టపత్రంలో ఛాయిస్ ఉన్నప్పుడు ప్రశ్నలు ఎంపిక సరిగా ఉండేలా చేసుకోండి. కఠినంగా ఉన్న ప్రశ్నలపై ఆందోళన చెందవద్దు. ముందుగా సులభంగా ఉన్న ప్రశ్నలు జవాబు రాసిన తర్వాత కఠిన ప్రశ్నలు రాయాలి. విద్యార్థులు ఎరుపు సిరా పెన్ను వాడకూడదు. వరకు జవాబులు వ్యాసంలో రాయకుండా పాయింట్స్ రూపంలో రాయండి. సైడ్ హెడ్డింగులను టెన్త్ అండర్లైన్ చేయండి. చేతిరాత బాగుంటేనే చేసే ఉపాధ్యాయునికి మీ పట్ల మంచి అభిప్రాయం కలుగుతుంది. బిట్ పేపర్లో కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా జాగ్రత్త వహించండి అని తెలిపారు. దక్షిణ కొరియా లో ఫిజిక్స్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న కోనాపూర్ నివాసి డాక్టర్ శనిగరపు మల్లేశ్ ప్రసంగిస్తూ విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నత స్థాయి లక్ష్యాలు కలిగి ఉండాలని, లక్ష్యసాధనకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా భయపడకూడదు అని , రాము ఉన్నత పాఠశాల దశలో ఎన్నో కష్టనష్టాల గురించి చదువుకున్నామని, ఇప్పుడు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా అని అన్నారు.

## అటవీ భూమిపై వివాదం..

# ఎంక్వైరీలో ప్రభుత్వ భూమి అని తేలింది

– నిమ్మ తోటపై హక్కుల వివాదం అధికారుల విచారణలో నిజాలు వెలుగు

– సిరికొండ అటవీ భూమి వ్యక్తిగతం కాదని స్పష్టం తప్పుడు ప్రచారంపై కండన

– అటవీ భూమి తనదేనన్న వ్యక్తి వాదన ఖండన.. ప్రభుత్వ భూమి అని చేర్చిన అధికారులు













నిజామాబాద్ రూరల్: మార్చి, 7 (ప్రజా జ్యోతి) డవి మధ్యలో నిమ్మ తోట ఆశ్చర్యంలో ప్రజలు అనే వార్త శనివారం ప్రజా జ్యోతిలో ప్రచురమైన వార్తకు స్పందించిన అధికారులు నిజామాబాద్ జిల్లా రూరల్ పరిధిలోని సిరికొండ అటవీ రేంజ్‌లో ఉన్న చీమన్‌పల్లి వెళ్లే దారి పక్కన అంగడి బజార్ అడవి భూమిపై వ్యక్తిగత హక్కులు ఉన్నాయని వచ్చిన వార్తలపై శనివారం అధికారులు విచారణ నిర్వహించారు. పంది మడుగు గ్రామానికి చెందిన జరుపుల ప్రతాప్ అనే వ్యక్తి ఉపాధి హామీ పథకం ద్వారా నిమ్మ చెట్లను నాటించగా, వాటికి నీళ్ళు పోయడానికి ఈజీఎస్ తరఫున వాచర్‌గా ప్రతాప్ ను నియమించారు. అయితే ప్రతాప్ ఈ భూమి తనదేనని ఆర్ ఎఫ్ ఆర్ వో లో పట్ట ఉంది అని చెప్పడంతో కొన్ని పత్రికలు, ఛానళ్లలో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం సిరికొండ తహసీల్దార్ ఆర్. రవీందర్ రావు, ఎంపీడీవో కే.ఆర్. మనోహర్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ కే. నర్సింగ్ రావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానికి చెందిన అటవీ భూమి అని అధికారులు స్పష్టం చేశారు. వాచర్‌గా నియమించిన పందిమడుగు గ్రామానికి చెందిన ప్రతాప్ అనే వ్యక్తిని తొలగించి, సిరికొండ గ్రామానికి చెందిన వ్యక్తిని వాచర్‌గా నియమించాలని సూచించారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో నిమ్మ చెట్లతో పాటు అల్లనేరేడు, సీతాఫల్, బండ్ల వంటి మొక్కలను పెంచాలని ఎఫ్ఆర్ఓ కే. నర్సింగ్ రావు సూచించారు. ఈ అంశంపై వచ్చిన తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ, ఇకపై ఇటువంటి వార్తలను ప్రచురించకుండా ఆపివేయాలని అధికారులు తెలిపారు.

# మార్చి 14 నుంచి పదవ తరగతి పరీక్షలు

– మండలంలో 4 పరీక్ష కేంద్రాలు.. 696 మంది విద్యార్థులు హాజరు – మండల విద్యాధికారి రాములు



నిజామాబాద్ రూరల్: మార్చి, 7 (ప్రజా జ్యోతి) పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్నట్లు సిరికొండ మండల విద్యాధికారి రాములు తెలిపారు. శుక్రవారం ప్రజా జ్యోతి దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం ఈసారి ప్రతి పరీక్ష మధ్య విరామం (గ్యాప్) ఇవ్వడం వల్ల విద్యార్థులకు చదువుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. సిరికొండ మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరికొండ పరీక్ష కేంద్రంలో 156 మంది, మోడల్ స్కూల్ కేంద్రంలో 280 మంది, వాల్గోట్ కాలన్ కేంద్రంలో 111 మంది, కొండాపూర్ కేంద్రంలో 149 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. మొత్తం 696 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యుత్, తాగునీరు, బాత్రూమ్, టాయిలెట్ వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మండల విద్యాధికారి తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ బందోబస్తు మధ్య సెక్షన్ 144 అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎవరూ ఉండరాదని, పరీక్ష కేంద్రంలోకి నియమిత సిబ్బంది తప్ప ఇతరులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అలాగే పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా సిరికొండ కేంద్రానికి సతీష్ గౌడ్, వాల్గోట్ కాలన్ కేంద్రానికి శ్రీనివాస్, మోడల్ స్కూల్ కేంద్రానికి లాల్ సింగ్, కొండాపూర్ కేంద్రానికి తిరుపతి బాధ్యతలు నిర్వర్తిస్తారని మండల విద్యాధికారి రాములు తెలిపారు.

# అభివృద్ధికి సహకరించాల్సింది పోయి అనవసర విమర్శలు చేస్తున్నారు

– బీజేపీ – బీఆర్ఎస్ రెండు తోడుదొంగలే

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రత కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి








నిజామాబాద్ రూరల్: మార్చి 7 (ప్రజా జ్యోతి) ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలు అనవసర విమర్శలకు దిగడం అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని ఖానాపూర్ డివిజన్ నంబర్--1 కాలూరులో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి పారిశుద్ధ్య పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొద్దిసేపు చీపురు పట్టి రోడ్డు ఊడ్చి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దేశం కోసం త్యాగం చేసిన ఇందిరాగాంధీ కుటుంబంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఖండించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక సోషల్ మీడియాలో కాంగ్రెస్ అగ్రనేతలపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు ఇక్కడి ఓట్లతో గెలిచి గుజరాత్ అభివృద్ధికి నిధులు తీసుకుపోతుంటే, ఇక్కడి టీఆర్ఎస్ నాయకులు వారికి వత్తాసు పలుకుతూ ఇద్దరు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాల్సింది పోయి అనవసర ప్రచారాలకు దిగడం విచిత్రంగా ఉందన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో రాబోయే రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు భాగారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ అగ్గు భోజన్న, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హాస కొత్తూరులో డాక్టర్ జన్మదిన వేడుకలు

– పంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ









కమ్మర్ పల్లి మార్చ్ 7,ప్రజా జ్యోతి. కమ్మర్ పల్లి మండలం హస కొత్తూరు గ్రామంలో శ్రీమతి తెడ్డు వసుందర రమేష్ గార్ల కూతురు డాక్టర్ తెడ్డు కస్తూరి జన్మదినం వేడుకలు గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ ,పాలక వర్గం, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కూతురు జన్మదినం మీ మధ్య జరపడం మాకు చాలా సంతోషంగా ఉందని తెలిపినారు. పారిశుద్ధ్య కార్మికుల అందరికీ బట్టలు పెట్టినారు. అలాగే మీరు చేసే పనిలో పూర్తి నిబద్ధతతో చేసి మన గ్రామానికి ,సర్పంచ్ కు మంచి పేరు తేవాలని.... మీకు భవిష్యత్ లో ఎలాంటి అవసరాలకైన మా కుటుంబం ముందు వుంటదని వారికి తెలుపడం జరిగినది. ఇట్టి కార్య క్రమం లో గ్రామ సర్పంచ్ శ్రీ నలిమెలారేవతిగంగారెడ్డి ,పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్ పాలక వర్గం సభ్యులు రాధారపు గంగాధర్,కనక నర్సయ్య, జంగం మహేష్‌లు పాల్గొన్నారు.

# ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు

– జహీరాబాద్ మండల్ ఎక్స యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హోలియ దాసరి రాములు



**జహీరాబాద్, మార్చ్ 7(ప్రజా జ్యోతి న్యూస్)** పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఎక్స్ జహీరాబాద్ మండల్ అధ్యక్షుడు మేకల రాములు ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం ఉపవాసాలు 17వ రోజులు పూర్తి అయిన సందర్భంగా జహీరాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరంలో ముస్లిం యువత ఎక్కువగా ఉపవాసాలు ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి ముస్లిం ఈ పవిత్ర రంజాన్ మాసంలో జకాత్ ఇవ్వటం ఆనవాయితీ అన్నారు. తద్వారా పెద ముస్లింలు కూడా పండుగ సంతోషంగా చేసుకునే అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. జకాత్ ఇవ్వడం ప్రతి ముస్లిం కనీస ధర్మం అన్నారు. జకాత్ స్వీకరించడానికి వచ్చే ముస్లింలను ఆదరించాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు పొంది అల్లాహుతాలు కృపకు పాత్రులవుతారని పిరానీ పీర్ గౌసే ఆజం దస్తగీర్ జెండా ఘనంగా రంజాన్ పండగ వేడుకలు జరుపుకుంటారని యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ మండల్ మాజీ అధ్యక్షుడు హోలియా దాసరి రాములు అన్నారు.

# 'కాళేశ్వరం' సాక్షిగా.. దందా యథేచ్ఛగా!

– ఆగని అక్రమార్కుల కాసుల వేట – అధికారుల కళ్లుగప్పి రవాణా..!




**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** మండలంలో ఇసుక మాఫియా ఆకాశమే హద్దుగా చెలరేగిపోతోంది. శనివారం సైతం విరామం లేకుండా అక్రమార్కులు తమ కాసుల వేటను యథేచ్ఛగా కొనసాగించారు. మండలంలోని మహమ్మదాబాద్, చిప్పల్తుర్తి గ్రామాల కలయిక ప్రాంతమైన కాళేశ్వరంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అధికారుల కళ్లుగప్పి ఈ నెట్‌వర్క్ సాగిస్తున్న తీరు విస్తుగొలుపుతోంది. కాసుల వేటలో నిబంధనలను తుంగలో తొక్కడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అధికారుల పనివేళలనే తమకు అనుకూలంగా మార్చుకుంటున్న మాఫియా, అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సంబంధిత అధికారులు ఉదయం 10 గంటలకు విధులకు హాజరవుతారు. దీన్ని ఆసరాగా చేసుకుని తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగుతున్నారు. అధికారులు ఆఫీసులకు చేరుకునేలోపే ఒకటి నుంచి రెండు ట్రిప్పుల ఇసుక తరలింపును పూర్తి చేస్తున్నారు. నిఘా ఉండేలోపే పని ముగించి పరారవుతున్నారు.

**కృత్రిమ ఇసుకతో అక్రమ సంపాదన**

సహజ సిద్ధమైన ఇసుకను రోజుకు మూడు నుంచి నాలుగు ట్రిప్పుల వరకు కృత్రిమంగా తయారు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ, ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్భయంగా కొనసాగిస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి సాగిస్తున్న ఈ దందా వెనుక ఎవరి ప్రోద్బలం ఉందో అర్థం కాక స్థానికులు తలలు పట్టుకుంటున్నారు.

**యంత్రాంగం చర్యలు తీసుకోవాలి!**

మాఫియా ఇంత బహిరంగంగా రెచ్చిపోతున్నా, అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గంగారం కుమార్తె వివాహంలో

# మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**నారాయణఖేడ్ మర్చ్ 7 (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లాఖేడ్ ప్రాంతం లోని కంగ్టి గ్రామంలోని బసవ ప్రదీప్ ఫంక్షన్ హాల్లో రాజారామ్ తండా కీ చెందిన గంగారాం కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సారీక్ సిద్రామ్ వార్డు మెంబర్ ప్రకాష్ అస్తూరే కంగ్టి గ్రామ సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న దానం మహా

# గొప్పది లొంక హనుమాన్ కోరికలు

నెరవేర్చే దేవుడు ఎమ్మెల్యే పి అనుపమ సంజీవరెడ్డి దంపతులు





**నారాయణఖేడ్ మార్చ్ 7( ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లానారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన దేవాలయం డోవూర్ శివారులోని లొంక హనుమాన్ మందిరంలో అతిమ్యాల్ గ్రామానికి చెందిన కురుమ రాజు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల అనుపమ సంజీవరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డి మాట్లాడుతూ...... అన్నదానం అన్ని దానాల కన్నా గొప్పదని, అన్నదానంలో ఉన్న తృప్తి దేంట్లో ఉండదని తెలిపారు. రోజురోజుకు లొంక హనుమాన్ మందిరంలో వెలిసిన హనుమాన్ దర్శనానికి వచ్చిన భక్తుల కోరిక నెరవేరడంతో తండోపతండాలుగా వచ్చి ప్రజలు హనుమాన్ మందిరంలో మొక్కులు చెల్లించుకుని హనుమాన్ భగవంతునికి దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి మనశ్శాంతి పొంది విశ్రాంతి తీసుకొని, గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి ఎంతో ఉల్లాసంగా భక్తి భావంతో ఆనందం పొందుతున్నారని తెలిపారు. భక్తితోనే మానవ జాతికి విముక్తి లభిస్తుందని, భక్తిలో ఉన్న తృప్తి దేంట్లో ఉండదని, అన్ని మార్గాల కన్నా భక్తి మార్గం ముఖ్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నారాయణఖేడ్ ప్రాంతానికి ఆదర్శ దేవాలయంగా పేరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాణాపురం రాజు, శ్రీవాణి కౌన్సిలర్,ఎల్గోయి గ్రామ సర్పంచ్ శివాజీ, ఉప సర్పంచ్ అంజయ్య,కురుమరాజు,ప్రభాకర్ కురుమ,మోహన్ రెడ్డి,వెంకట్ రెడ్డి, రాజ్ కుమార్ కురుమ,గ్రామ పెద్దలు మరియు ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కష్టంతో కాదు

# ఇష్టంతో చదివి ఉన్నత స్థాయి చేరుకోవాలి

– బీజేపీ నాయకుడు పాలింకర్ సంతోష్



**జహీరాబాద్, మార్చ్ 07(ప్రజా జ్యోతి న్యూస్)** నియోజకవర్గం పట్టణంలో గల 24 వ వార్డు బిజెపి నాయకుడు పాలెంకార్ సంతోష్ మాట్లాడుతూ... కష్టంతో కాదు ఇష్టంతో చదివి విద్యార్థుల జీవితంలో ఉన్నత స్థితికి చేరుకో వాలని పేర్కొన్నారు. శుక్రవారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థినులకు కష్టపడి చదివి జీవితంలో ఏదైనా సాధించా లంటే ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. జీవితంలో లక్ష్యం ఏర్పరచుకొని లక్ష్యాన్ని సాధించేలా ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు త్వరలో పరీక్షలు ప్రారంభం కానున్నయని గురువులు బోధించి నటువంటి విద్యను ఒక క్రమపద్ధతిలో నేర్చు కొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. తల్లిదండ్రులకు చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా విద్యార్థు లకు సూచించారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి సామాజానకి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

# తలాపునే గోదారి – పంట పొలాలు ఎడారి



**సిద్దిపేట రూరల్, మార్చి 07, (ప్రజాజ్యోతి):** తలాపునే గోదారి -- మా పంట పొలాలు ఎడారి అంటూ సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ రైతులు నిరసన తెలిపారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో గ్రామ చెరువును నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డుపై బైఠాయించి తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చెరువులోకి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రంగనాయక సాగర్ ఎడమ కాలువ పుల్లూరు గ్రామం నుంచి దాదాపు 9 కిలోమీటర్ల దూరం వెళ్తున్నప్పటికీ, గ్రామ చెరువుకు నీరు రాకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలువ నిర్మాణం కోసం తమ భూములను వదులుకున్నప్పటికీ గ్రామానికి ప్రయోజనం లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇరిగేషన్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని రైతులు తెలిపారు. అందుకే పార్టీలకు అతీతంగా రైతులంతా కలిసి ధర్నా చేపట్టామని చెప్పారు. మల్లన్నసాగర్ కాల్వ ద్వారా త్రీ-ఆర్ కాలువ పనులను త్వరగా పూర్తి చేసి పుల్లూరు సహా పరిసర గ్రామాలకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు.

## పెంచిన గ్యాస్

# సిలిండర్ ధరలు తగ్గించాలి



**సిద్దిపేట అర్బన్, మార్చి 07 , (ప్రజాజ్యోతి):** పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కమాన్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను 115 రూపాయలు , గృహ వినియోగ సిలిండర్ ధరను 60 రూపాయలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారీ భారం పడుతుందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుపర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగర వెంకట్, బద్దిపడగ కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, అమ్ముల బాల నర్సయ్య, తిప్పారపు శ్రీనివాస్, సింగిరెడ్డి నవీన్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, మండల కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నారీమణులు అన్ని రంగాల్లో రాణించాలి

– న్యాయమూర్తి హేమలత పిలుపు



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** మహిళలు స్వశక్తితో ఎదిగి, అన్ని రంగాల్లో తమ ప్రాధాన్యతను చాటుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్, న్యాయమూర్తి హేమలత పిలుపునిచ్చారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంఘం, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి హాజరయ్యి మాట్లాడారు.. ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవాధికార సంఘాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. మెదక్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి మాట్లాడుతూ.. మహిళలు మనోధైర్యంతో ముందడుగు వేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మహిళలు లేనిదే సమాజం లేదని కొనియాడారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీధర్ రెడ్డి, న్యాయవాది స్వరూప రాణి, ఆర్డీవో ఎన్జీవో కో-డైరెక్టర్ సునీత, ఐసీడీఎస్ సూపర్వైజర్లు సరళ కుమారి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



**తొగుట, మార్చి 07(ప్రజాజ్యోతి):** విద్యార్థులు పదవతరగతి స్థాయినుండే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని తొగుట మండలం గుడికందుల గ్రామ మాజీ ఉప సర్పంచ్ మల్లు గారి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గుడికందుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు శనివారం శ్రీకాంత్ రెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రిక్ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పేర్కొన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడిలకు గురవకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజులలో విద్యార్థులకు ఎలాంటి సహాయ సౌకర్యాలు కావాలన్నా తనవంతంగా అందిస్తానని తెలిపారు. పదవతగతి పరీక్షా ఫలితాలలో గ్రామాన్ని మండలంలోనే మొదటి స్థానంలో నిలుపాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలలో మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు అంజి రెడ్డి, గ్రామ పెద్దలు ఎడ్ల మల్లయ్య, మద్దూరి ఎల్లం గ్రామ యువకులు పాల్గొన్నారు.

# నారీమణి లోకానికి ఆదర్శం!

– మున్సిపల్ ఛైర్పర్సన్ లక్ష్మిరాజు యాదవ్



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** పురుషులకు దీటుగా మహిళలు అన్ని విభాగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ అన్నారు. శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సాధికారత స్పష్టంగా కనిపిస్తోందని, వారి అభివృద్ధికి తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూనే, పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు మహిళలందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసి, కార్యాలయ పరిసరాలను శ్రమదానంతో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్.ఐ. రంజిత్ రెడ్డి, కౌన్సిలర్లు నరసమ్మ, అఫ్రీన్, సరళ, అంగన్‌వాడీ టీచర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యవసర రక్తదానం చేసి

# ప్రాణం కాపాడిన కానిస్టేబుల్




**సిద్దిపేట, మార్చి 7, (ప్రజాజ్యోతి):** సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమని తెలుసుకున్న త్రీ టౌన్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. విధి నిర్వహణలో ఉండగానే సమాచారం అందుకున్న ఆయన తక్షణమే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తం దానం చేసి రోగి ప్రాణాలను కాపాడటంలో సహకరించారు. ఆయన మానవత్వానికి పలువురు అభినందనలు తెలిపారు

## రాంపూర్ ప్రాథమిక

# పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం

**తొగుట, మార్చి 07(ప్రజాజ్యోతి):** తొగుట మండలం రాంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే శనివారం స్వయం పాలనా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులు అయి తోటి విద్యార్థులకు విద్యను బోధించడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ విద్యార్థులు స్వయం పరిపాలన తో తమ బాధ్యతలను తెలుసుకుంటారని, తగగతి గదిలో విద్యార్థులను చదువుపై దృష్టి పెట్టేలా చేయడం, పాఠశాల నిర్వహణ బాధ్యతలు తెలుసుకోవడం వంటి అంశాలపై అవగాహన కలిగిఉంటారాని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన విషయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు డీఈఓగా శేరుపల్లి అక్షయ్ కుమార్, ఏంఈఓ గా శేరుపల్లి అరుణ్ కుమార్, ప్రధానోపాధ్యులుగా అజయ్ కుమార్, ఉపాధ్యాయులుగా భానుశ్రీ, హారిక, యోధ, అశ్విని లు పాల్గొన్నారు.



## 16వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులు

**- పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**- చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్**




**పరిగి, మార్చి 07 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు శాంతినగర్ కాలనీలో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ విశాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, వార్డు అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శాంతినగర్ కాలనీలోని నాలా వద్ద పెరిగిన చెట్లను తొలగించి జేసీబీ సహాయంతో శుభ్రపరిచారు. అదేవిధంగా మురికి కాలువలను శుభ్రం చేయించడంతో పాటు వీధి దీపాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ మాట్లాడుతూ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరను ఎఫ్ఆర్ఎస్ వంద శాతం చెయ్యాలి..

**- ఎఫ్ఎల్ఎన్ అలాగే ఎఫ్ఎల్ఎస్ రిజిస్టర్ల పరిశీలన**
**- ఎఫ్ఎల్ఎన్ అంత్య పరీక్ష , ఈనెల 9 నుండి 11 వరకు నిర్వహించాలి: మండల విద్యాధికారి**



**పరిగి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా ఉపాధ్యాయులు అలాగే విద్యార్థుల కచ్చితంగా వంద శాతం నమోదు చేయాలని, అదేవిధంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరాసి అంత్య పరీక్షలు ఈనెల 9 నుండి 11 వరకు నిర్వహించాలని పరిగి మండల విద్యాధికారి ఎం అంజయ్య అన్నారు. శనివారం పరిగి మండలంలోని ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరు ను సందర్శించి ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్, రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనము విద్యార్థులకు అందించాలని సూచించారు. మండల విద్యాధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా పాఠశాలకు విచ్చేసినందుకు ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మాణిక్యం, ఉప సర్పంచ్ మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయ బృందం కలసి మండల విద్యాధికారి ఎం.అంజయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, ఎన్ నర్సింలు, రాజు, ఎంఆర్సి మెసెంజర్ శ్రీశైలం తోపాటు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు జనార్ధన్, కుమ్మరి అనంత, ఎం యాదమ్మ, గ్రామ సెక్రెటరీ బాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 8వ వార్డులో హెల్త్ క్యాంప్..

**- క్యాంప్‌ను సందర్శించిన కలెక్టర్ దీపక్ తివారి**




**పరిగి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** పరిగి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఎస్టీ బాలికల హాస్టల్ విద్యారణ్యపురి తుంకలగడ్డలో నిర్వహించిన హెల్త్ క్యాంప్ అలాగే ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో విద్యార్థినులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలను అందిస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారుల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కడుముల రజిత వెంకటేష్ పాల్గొని, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే 8వ వార్డ్ కౌన్సిలర్ హబీబ్ వున్నీసా అయ్యూబ్ పాల్గొని అభివృద్ధి వార్డు అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ విశాల్, ఏయంసి వైస్ చైర్మన్ అయ్యూబ్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కాలేజీ ప్రిన్సిపల్ తోపాటు కాలనీ వాసులు కాశిఫ్ ముజాక్కిర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు



**వికారాబాద్ ప్రతినిధి, మార్చి07(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళలందరికీ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు ఉన్న సమాజంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నేటి మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు, రాజకీయ రంగాల్లో ప్రతిభ చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళలు అవసరమైనప్పుడు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతపై అవగాహన పెంచేందుకు షీ టీమ్, కళాజాత బృందాల ద్వారా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ తన హక్కులపై అవగాహన పెంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# రోడ్లపైనే కూరగాయల వ్యాపారం

**- తాండూర్‌లో రైతుబజార్ మాయం!**
**- కళగా మిగిలిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్**
**- ఎమర్జెన్సీ వాహనానికి సైతం అడ్డంకి**



**తాండూరు మార్చ్ 7 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణములో కూరగాయల వ్యాపారం రోడ్డుపైనే కొనసాగుతుంది. దీంతో ఎమర్జెన్సీ 108 వాహనానికి సైతం అడ్డంకిగా మారిన సన్నివేశం శనివారం చోటుచేసుకుంది. తాండూరు పట్టణంలో నిత్యం వివిధ పనుల కోసం వేలాదిగా ప్రజలు తరలివస్తారు. అదే స్థాయిలో చిరు వ్యాపారులు, రోడ్ల పైన కూరగాయలు విక్రయించే వారు, అలాగే తోపుడుబండ్ల పైన పళ్ళు కూరగాయలు వంటి వాటిని విక్రయిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో 50 అడుగుల రోడ్డు కాస్త చిన్నదిగా మారిపోతుంది. నిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు ట్రాక్టర్లు ఈ రోడ్డున వెళ్లడం ఎంతో ఇబ్బందిగా మారిపోయింది. వేల సంఖ్యలో పాదాచార్యులు అదేవిధంగా పనుల కోసం తాండూర్ కు వస్తారు. అలాగే కూరగాయల వ్యాపారులు రద్దీగా ఉండడంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో రైతు బజార్ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడికి రైతులు కూరగాయలు విక్రయించడం కోసం వెనుకడుగు వేశారు. మున్సిపల్ అధికారులు గానీ పోలీసులు గాని పట్టించుకోకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. శనివారం రోజు ఓ ఎమర్జెన్సీ వాహనం జిల్లా ఆసుపత్రికి వచ్చే క్రమంలో కూరగాయల వ్యాపారులు



నీడగా ఏర్పాటు చేసుకున్న తాడిపత్రికి చిక్కుకొని కాస్త ఇబ్బందిగా మారిన సన్నివేశం కనిపించింది. తాండూరు పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోమ్ ముందర అప్పట్లో ఎడ్ల బజార్ కొనసాగేది. దానిని తాండూరు మండల పరిధిలోని ఖాంజాపూర్ గ్రామ సమీపంలోకి మార్చడంతో ఇదే స్థలంలో రైతు బజారును ఏర్పాటుచేసి రైతులు పండించిన కూరగాయలను సేకరించడం కోసం అనువైనదిగా ఎంపిక చేశారు. తదుపరి కొన్నాళ్లకే గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కూరగాయల విక్రం కోసం దుకాణ సముదాయాలు అదేవిధంగా షెడ్లు నిర్మించారు. కొద్దికాలంలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ మూత పడిపోయే స్థితికి చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందిస్తారో లేదు చూడాల్సిందే.

# ఆర్టీసీ మహిళా ఉద్యోగస్తులకు ఘన సన్మానం




**- తాండూరు డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**
**- మహిళలను సోదర భావంతో గౌరవించాలి**
**- తాండూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి**
**- డిపో మేనేజర్ సురేష్ కుమార్**

**తాండూరు మార్చ్ 7 ప్రజా జ్యోతి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తాండూరు బస్ డిపోలో ఘనంగా నిర్వహించారు. శనివారం రోజు తాండూరు ఆర్టీసీ డిపోలో స్థానిక డిపో మేనేజర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూరు మున్సిపాల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి, కమిషనర్ మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళాలు అన్ని రంగాలలో కూడా రాణిస్తున్నారని చెప్పారు. అత్యంత కష్టతరమైన టువంటి ఆర్టీసీ కండక్టర్ ఉద్యోగంలో కూడా మగవారితో పోటీగా మహిళలు విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. మహిళలకు ఏ సమస్య వచ్చిన తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం ఆర్టీసీ మహిళా కండక్టర్లు, ఇతర సిబ్బందిని సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా కండక్టర్లు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుంది: జంపన ప్రతాప్



**బోయినపల్లి, మార్చి 7 (ప్రజాజ్యోతి) :** ఆలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తి భావం మరింతగా పెంపొందుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు సీతారాం పురంలో ఉన్న శివ పంచాయతన హనుమాన్ ఆల యంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామికి శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన కార్య క్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో నిర్వహించే భజనలు, కీర్తనలు మరియు ఇతర విశేష పూజ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబా యాదవ్, విజయ్ రాజు, గోవర్ధన్, పాండు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**మహిళల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరాలు**




**బోయినపల్లి, మార్చి 07 (ప్రజాజ్యోతి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో శనివారం మడ్ ఫోర్ట్‌లోని కేజేఆర్ వైస్రాయ్ గార్డెన్స్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగానే ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించగా, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలను అంబరాన్నంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తాను కూడా ఎన్నో ఏళ్లుగా వ్యక్తిగతంగా మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా శిక్షణ అందిస్తున్నానని తెలిపారు. కంటోన్మెంట్ నియోజక వర్గంలోని ప్రతి మహిళ తనను తమ తోబుట్టువుగా భావించి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి ప్రేమాభిమానాలకు తాను ఎప్పటికీ ఋణపడి ఉంటానని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే కుటుంబాలు బాగుంటాయని, తద్వారా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మహిళల అండదండలు తనకు అందించాలని కోరుతూ మరోసారి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# స్వచ్ఛత కోసం సమిష్టి కృషి అవసరం

**- చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయొద్దు**
**- మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి**
**- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం**

**చేవెళ్ల మార్చి 07(ప్రజా జ్యోతి) :** పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన '99 రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం'లో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకు మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశం, వైస్ చైర్‌పర్సన్ రాములు, వార్డు కౌన్సిలర్లు దూత మల్లేష్, దప్పు సువర్ణ చందు, శైలజ ఆగి రెడ్డి తదితరులతో కలిసి 1, 2వ వార్డుల మొండివాగు, ఊరేళ్ల ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి కాలనీల్లో పరిశుభ్రత పనులు నిర్వహించారు. స్థానిక ప్రజలతో కలిసి మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ తమ ఇళ్ల చుట్టుపక్కల శుభ్రతను కాపాడుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ





వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్‌లలో వేసి చెత్త సేకరణ ఆటోలకు అందించాలని చైర్‌పర్సన్ సమత వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి విశాల్ రాజ్ :** '99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారి ఎస్. విశాల్ రాజ్ (అసిస్టెంట్ డైరెక్టర్-సీడీఎంఏ) హాజరై పనులను పరిశీలించారు. పరిశుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

**- మహిళా దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంచనపల్లి శ్రీనివాస్**



**పరిగి, మార్చి 07 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళల సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని పి.ఆర్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత మంచనపల్లి శ్రీనివాస్ కోరారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల అభివృద్ధిని ప్రధాన ప్రమాణంగా తీసుకోవాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. మహిళల హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల ఫలితంగా ఐక్యరాజ్యసమితి మార్చి 8ను అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించిందన్నారు.

భారతదేశంలో మహిళల హక్కులు, సమానత్వం కోసం జ్యోతిరావు పూలే దంపతులు, కందుకూరి వీరేశలింగం, రాజారామ్ మోహన్ రాయ్, సరోజిని నాయుడు వంటి మహనీయులు పోరాటం చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగం ద్వారా మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాజంలో సమాన హక్కులు కల్పించబడినట్లు తెలిపారు. మహిళల సర్వతోముఖాభివృద్ధి కోసం హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

## ఘనంగా మహిళ అంతర్జాతీయ దినోత్సవం...



**బాలాపూర్ మార్చి 7 (ప్రజాజ్యోతి) :** స్త్రీ ,పురుష సమానత్వం మహిళా సాధికారతను ప్రోత్సహించాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్ధాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బడంగ్పేట్ లార్డ్స్ హైస్కూల్లో మహిళ అంతర్జాతీయ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, విద్యార్థినీలు మహిళల ప్రాధాన్యత గురించి విద్యార్థులు ఉపన్యాసం నాటికలు పాటలు చిత్రలేఖనం వ్యాసరచనలు పలు కార్యక్రమాలతో మహిళ అంతర్జాతీయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం చైర్మన్ సిద్ధాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మార్చి8న మహిళా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మహిళలు సాధించిన సామాజిక ఆర్థిక సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలను ప్రతి ఒక్కరు కీర్తించాలన్నారు. సమాజంలో మహిళల కీలక పాత్ర ఎంతో అవసరం అన్నారు. స్త్రీ పురుషుల సమానత్వం మహిళల సాధికారతను ప్రోత్సహిస్తూ ఆకాశంలో సగం అవకాశంలో సగం అనే నినాదంలో మహిళలను గౌరవించాలని వారి కళలను సహకారం చేసుకోవడానికి మద్దతుగా ప్రతి ఒక్కరు నిలవాలన్నారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, డీన్ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంచార్జ్ రేఖ సాగర్, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్



**చేవెళ్ల మార్చి 07(ప్రజా జ్యోతి):** చేవెళ్ల ఆర్డీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. పార్థసింహా రెడ్డిని శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన కాసుల రాముగౌడ్, చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


కరీంనగ ర్ టౌన్,మార్చి 7( ప్రజాజ్యోతి )
కరీంనగర్ నగరంలోని కొత్తపల్లి ప్రాంతంలో ఉన్న అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ప్రేమ, సహనం, త్యాగానికి మహిళలు ప్రతీకలని పేర్కొన్నారు. కుటుంబ




పోషణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వడానికే మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు.నేటి సమాజంలో మహిళలు ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు, క్రీడా రంగాల్లో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కుటుంబం మరియు సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలకు తగిన గౌరవం, ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.భారతదేశంలో పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలను ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా వ్యాపార రంగంలో సుధా నారాయణమూర్తి, క్రీడా రంగంలో హర్మన్ ప్రీత్ కౌర్ వంటి మహిళలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహిళా బోధన, బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మరణంలోను వీడని ఆలుమగల బంధం

చొప్పదండి, మార్చి 7 (ప్రజా జ్యోతి):
ఏన్నేనో జన్మల బంధం నీది... నాది అన్నట్లు బార్యభర్తలు చివరి మజిలిలోని మరణంలోను వారి బందం వీడిపోలేదు.భర్త చనిపోయిన ఐదుగంటల లోపే బార్యకూడా నీ మరణంలో తోడుంటానని మరణించింది.ఈ విషాదకర సంఘటన చొప్పదండి మున్సిపాలిటి పరిదిలోని పదమూడో వార్డులో జరిగింది. పోన్నాల లచ్చయ్య(85)శుక్ర



వారం సాయంత్రం తుదిశ్వాస విడిచాడు.అప్పటికే అనోరోగ్యంతో వరంగల్ ఏంజిఏం ఆసుపత్రిలో చిక్సిత పోందుతున్న ఆయన బార్య పోన్నాల హనుమమ్మ (80)భర్త మరణవార్త తేలుసుకోని రాత్రి పదిగంటలప్రాంతంలో కన్నుమూసింది.వారిపనివారు చేసుకుంటు వారిసంతానం అందించే ఆహారం మందులు స్వీకరిస్తు ఆనందంగా జివిస్తున్నారు. ప్రాణాలను హరించే యమకింకరుల పిలుపు అందుకోని లచ్చయ్య ఏ మనిషికైన తప్పని యమపాశం స్వీకరించారు. భర్తను విడిచి ఉండలేని హనుమమ్మ సైతం యమకింకరుల తో కోట్లాడి యమపాశంస్వీకరించి మరణంలోను భర్తతోడుగా వేళ్ళింది.వృద్దదంపతుల మృతి వారి కుటుంబం లో పెనువిషాదంనింపింది.వాడలో పలువుర్ని కన్నీటిపర్యంతం చేసింది. ఆపదసమయంలో బాదలో ఉన్న కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు సింహాచలం తులసి ప్రభాకర్ కలిసి ఓదార్చారు. ఆ కుటుంబానికి దైర్యం కల్పిస్తు అండంగా ఉంటామని భరోసా కల్పించారు.

## శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో పెన్నుల పంపిణీ

చొప్పదండి, మార్చి 7 (ప్రజా జ్యోతి):
తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, చొప్పదండి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత



పాఠశాల, అర్నకొండ జడ్పీహెచ్ఎస్ లో పెన్నులు పంపిణీ చేశారు. "సోల్జర్ కి గన్ను, స్టూడెంట్ కి పెన్ను" అనే నినాదంతో శ్రీనివాసుల సేవా సంస్థ ఈ కార్యక్రమం చేపట్టింది. చిలుకూరి బాలాజీ సుందరేశ్వర శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారావు మహారాజ్ సత్సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించామని శ్రీనివాసు సేవా సంస్థ బాధ్యులు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## మాతృశ్రీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం

వేములవాడ,మార్చి,7:ప్రజాజ్యోతి.
వేములవాడపట్టణమరియుపరిసర ప్రాంతాల మహిళలకు స్కిల్ డెవలప్మెంట్,కార్యక్రమంలోభాగంగాఉపాధికల్పించుటకొరకై )తెలియజేయునది,మాతృశ్రీ,హాస్పిటల్,మల్లారంరోడ్డు,వేములవాడమరియునేషనల్అకాడమీఆఫ్,కన్,స్ట్రక్షన్,స్కిల్క్,డెవలప్మెంట్ ,భాగంగాఉచితకుట్టుమిషన్,శిక్షణకార్యక్రమంనిర్వహించబడుతున్నది.మొదటిబ్యాచ్ :ఏప్రిల్ఒకటి2026 నుండి ఏప్రిల్ 30 2026 వరకు నిర్వహించబడును.అడ్రస్★
2nd
floorమాతృశ్రీహాస్పిటల్,మల్లరంరోడ్డు,వేములవాడ★అర్హతలు★★18సంవత్సరాలనుండి44సంవత్సరాల వయ స్సు, వరకు,బ్యాచ్ కి 20మంది...
సంప్రదించవలసిన
ఫోన్ నెంబర్స్ 9866334841, 96763 47589

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్,మార్చి 7( ప్రజాజ్యోతి )
కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజులు" పేరుతో మరోసారి అబద్దాలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. రెండు సంవత్సరాల క్రితం హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన విమర్శించారు.ప్రజా పరిపాలన పేరుతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఆరు పథకాల పేరుతో లక్షలాది దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ప్రజల వద్దకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని హరిశంకర్ విమర్శించారు. తమ వైఫల్యాన్ని అధికారులపై నెట్టివేయడానికి కాంగ్రెస్ పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు.నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డైలీ వాటర్ సరఫరా నిలిచిపోయి పది రోజులు గడిచినా పట్టించుకునే వారు లేరని ఆరోపించారు. ఎల్ఎండి డెడ్ స్టోరేజ్‌కు చేరువవుతున్న పరిస్థితిపై సమీక్షించేందుకు కూడా నగరపాలక సంస్థకు సమయం లేకపోవడం దురదృష్టకరమన్నారు. మార్చిలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే రాబోయే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు, 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు వంటి హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి గంగుల



కమలాకర్ నాయకత్వంలో మండుతున్న వేసవిలో కూడా రోజువారీ తాగునీటి సరఫరా జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం బీజేపీ పాలనలో నగర అభివృద్ధి పనులు నిలిచిపోయి పారిశుధ్య పరిస్థితి దెబ్బతిన్నదని విమర్శించారు.టాక్స్ వసూళ్ల పేరుతో ప్రజల ఇళ్లకు తాళాలు వేయడం సరైన పద్ధతి కాదని, ముందుగా కోట్ల రూపాయల బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, డివిజన్ అధ్యక్షులు తొంటి రాజేందర్, ఆరె రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, బండి శ్రీకాంత్, నారదాసు వసంతరావు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నాగుల కిరణ్ కుమార్ గౌడ్, సత్తినేని శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం: మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ టౌన్,మార్చి 7( ప్రజాజ్యోతి )
తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా నగరపాలక సంస్థ పాలకవర్గం కృషి చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" రెండో రోజు



కార్యక్రమంలో భాగంగా శనివారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 3, 4, 5, 6, 7 డివిజన్లలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించారు.99 రోజుల ప్రణాళికలో భాగంగా మొదటగా 3వ డివిజన్ విద్యారణ్యపురిలో కార్పొరేటర్ సాదవేణి లావణ్యతో కలిసి పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం రూ.5 లక్షల నిధులతో సీసీ డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. డివిజన్‌లో పలు కాలనీల్లో పాదయాత్ర చేపట్టి డ్రైనేజీ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.తరువాత 4వ డివిజన్ దుర్శేడ్ ప్రాంతంలో కార్పొరేటర్ భూపతి రవీందర్‌తో కలిసి పారిశుధ్య పనులు చేపట్టి రూ.5 లక్షలతో డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. స్థానిక దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో వసతి సౌకర్యాల ఏర్పాటుకు రూ.10 లక్షల నిధులను కేటాయించారు.
అలాగే 5వ డివిజన్‌లో కార్పొరేటర్ గాదె రూపతో కలిసి రూ.5 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం 6వ డివిజన్ గుంటూరుపల్లిలో మరో రూ.5 లక్షలతో డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పారిశుధ్య పనులను ప్రారంభించారు.7వ డివిజన్ సదాశివపల్లిలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్‌తో కలిసి రూ.9 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు




భూమిపూజ చేశారు. అనంతరం డివిజన్‌లో పలు ప్రజా సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు.
రెండో రోజు కార్యక్రమంలో మొత్తం ఐదు డివిజన్లలో పారిశుధ్య పనులు చేపట్టి డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు పరిసర ప్రాంతాలు, ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. డివిజన్లలో ప్రజలు సూచించిన డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నగరంలోని 66 డివిజన్లలో ప్రజల సమస్యలను దశలవారిగా పరిష్కరించి కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మొదటి పది రోజుల్లోనే పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.డివిజన్లలో ఎక్కడ అపరిశుభ్రత లేకుండా మెరుగైన పారిశుధ్య పనులు చేపడతామని, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి దెబ్బతిన్న డ్రైనేజీలను మరమ్మతు చేస్తామని తెలిపారు. కొత్తగా నగరంలో విలీనం అయిన గ్రామాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నందున వాటికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.అమృత్ 2.0 పథకం కింద నీటి సరఫరా పైపులైన్ పనులు చేపడుతున్నామని, పైపులైన్ లేని కాలనీల్లో పైపులైన్ వేయడంతో పాటు అవసరమైన చోట రిజర్వాయర్లు నిర్మించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. అలాగే వీధి దీపాలు లేని చోట కొత్త పోల్స్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి అవసరాలు తీర్చడం, డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం వంటి పనులను పూర్తి చేస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎస్ఈ రాజ్ కుమార్, పారిశుధ్య అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నుంచి డబ్బుల వసూళ్లు - ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం

ముస్తాబాద్, మార్చి 7 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 6, 7వ తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.
విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాలను సందర్శించి విద్యార్థులను వివరాలు అడగగా, ఎగ్జామ్ ఫీజు పేరుతో ఒక్కొక్కరికి రూ.100 తీసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు.
ఈ విషయంపై ఉపాధ్యాయులను ప్రశ్నించగా జిరాక్స్ ఖర్చులు, పరీక్ష పేపర్ల కోసం డబ్బులు తీసుకున్నామని చెప్పారు. అలాగే దాతలు ఇచ్చిన టీ–షర్ట్లు సరిపోకపోవడంతో విద్యార్థుల నుంచి రూ.200 వసూలు చేశామని తెలిపారు. అయితే ఈ సమాధానాలు సరైనవిగా లేవని ఎన్ఎస్‌యూఐ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నుంచి ఈ విధంగా డబ్బులు వసూలు చేయడంపై ఎన్ఎస్‌యూఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హెడ్మాస్టర్, ఎంఈఓగా ఉన్న పాఠశాలలోనే ఈ ఘటన జరగడం ప్రజల్లో అయోమయానికి దారితీస్తోందని అన్నారు.



ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ పాఠశాలల్లా మారుతున్నాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం 1 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ, డబ్బులు వసూలు చేసిన ఉపాధ్యాయులపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినిలకు సన్మానం

వేములవాడ,మార్చి,7:ప్రజాజ్యోతి.
చందుర్తిమండలంసనుగులప్రాథమికపాఠశాలలో మార్చి8అంతర్జాతీయమహిళాదినోత్సవాన్నిపుర



స్కరించుకునిమహిళాఉపాధ్యాయినిలకు శాలువాలతో ఘన సన్మానం చేయడం జరిగినది.. ఈసందర్భంగాప్రధానోపాధ్యాయులు ముఖేష్.కటుకూరి,మాట్లాడుతూఅంతర్జాతీయమహిళాదినోత్సవం,మహిళలసాధికారత,సమాన హక్కులుమరియుసమాజ అభివృద్ధిలోమహిళల పాత్రనుగుర్తుచేసుకుంటూవివిధ కార్యక్రమాలు నిర్వహించారు... మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుండి దేశ అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, విజ్ఞానం, క్రీడలు వంటి అన్ని రంగాలలో మహిళలు ముందంజలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళల హక్కులను పరిరక్షించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరియు విద్యాపరంగా మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత కోసం అందరూ కలిసి పనిచేయాలని, మహిళలను గౌరవించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల పోరాటాలకు గుర్తింపుగా, వారి విజయాలను స్మరించుకునే ముఖ్యమైన రోజుగా నిలుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాతరి నాగమణి, చింతల హరిష్మ, మాదవి, నవ్యలు పాల్గొన్నారు

## తల్లీబిడ్డల ఆరోగ్యమే సమాజానికి శ్రీరామరక్ష

### కౌన్సిలర్ ఇప్పపూల మమత - అజయ్

వేములవాడ,మార్చి,7:ప్రజాజ్యోతి.
అంగన్ వాడీ కేంద్రంలో అన్నప్రాశన, శ్రీమంతం కార్యక్రమాలు మహిళా, శిశు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. శనివారం వేములవాడ పట్టణంలోని 22వ వార్డు అంగన్వాడీ కేంద్రం ఒక చిన్నపాటి పండుగ వాతావరణాన్ని తలపించింది. స్థానిక కౌన్సిలర్ ఇప్పపూల మమత – అజయ్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాశన, గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకలో భాగంగా ఐదు నెలలు నిండిన చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన తొలి ముద్దను తినిపించి అన్నప్రాశన చేశారు. అదేవిధంగా, గర్భిణీలకు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి, పండ్లు, పూలు మరియు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇప్పపూల మమత మాట్లాడుతూ, "తల్లీబిడ్డల ఆరోగ్యమే సమాజానికి శ్రీరామరక్ష" అని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తూ చిన్నారుల బరువును ప్రతిరోజూ రికార్డుల్లో నమోదు చేస్తూ, వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలు నిండిన గర్భిణీలందరూ తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గర్భిణీలకు అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలను వివరించడంతో పాటు, వారికి బలవర్ధకమైన ఆహారాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయా లు, వార్డు మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ సౌందర్య, అంగన్వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు



## రేవెల్లి లో ముందస్తు మహిళా దినోత్సవం

చొప్పదండి, మార్చి 7 (ప్రజా జ్యోతి):
చొప్పదండి మండలం రేవెల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ బందారపు అజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ రాజకీయంగా ఆర్థికంగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ కార్యదర్శి గంగాజమున, మహిళా వార్డు సభ్యులు, ప్రభుత్వ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, సీఏ గ్రూప్ నాయకురాల్లను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇరుగురాల అంజయ్య, వార్డు సభ్యులు కొత్తూరు ప్రవీణ్, ఇరుగురాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాచర్ల గొల్లపల్లిలో పోచమ్మపండుగలో బోనంపై రేవంత్ రెడ్డి బొమ్మ....

ఎల్లారెడ్డిపేట మార్చ్ 7( ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో శనివారం రోజు పోచమ్మ బోనాల పండగ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి అభిమాని గోగుర్ శ్రీనివాస్ రెడ్డి బోనంపై రేవంత్ రెడ్డి



బొమ్మను తో తయారు చేయించిన బోనము బోనాలతో ఎత్తుకొని ఊరేగించాడు బోనాల పండుగలు ఎంతో ఆకర్షణగా నిలిచింది తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా మణులు రెడ్డి సంఘం నాయకులు ఆసక్తిగా తిలకించారు గోగూరి శ్రీనివాస్ రెడ్డి ప్రతీ పండగకు బతుకమ్మ పండక్కి బతుకమ్మ, బోనాల అప్పుడు బోనము వేసి ప్రజాకర్షణ పొందుతాడు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు బోనం ను తిలకించారు . దొమ్మాట నరసయ్య మర్రి శ్రీనివాస్ రెడ్డి వంగ గిరిధర్ రెడ్డి వివిధ నాయకులు తిలకించారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎం పి పి

ఇల్లంతకుంట మార్చ్ 7(ప్రజా జ్యోతి)
ఇల్లంతకుంట మండలం పత్తికుంట పల్లె గ్రామానికి చెందిన బోడ రమణారెడ్డి కూతురు వివాహ వేడుకల్లో పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించిన



ఇల్లంతకుంట మండలప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీ ఉట్కూరు వెంకటరమణా రెడ్డి రెడ్డి అమరేందర్ రెడ్డి , పారిపెల్లి దేవేందర్ రెడ్డి , బద్దం కృష్ణా రెడ్డి , సూరు బీరయ్య, సూరు తిరుపతి, అమరేందర్ , పోట్ల మల్లేశం , గూడ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓడిన గెలిచినా ప్రజా సేవే

### మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్

పరకాల, మార్చి 07, (ప్రజా జ్యోతి): గెలుపు–ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సేవే తమ లక్ష్యమని, ప్రజలే తమకు దైవమని మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పరకాల 17వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కేవలం ఒక్క బ్యాలెట్ ఓటుతో ఓడిపోయినప్పటికీ నిరాశ చెందకుండా ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గతంలో 13వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన తాము, ప్రజల కోరిక మేరకు పార్టీ ఆదేశాను సారం 17వ వార్డులో పోటీ చేశామని చెప్పారు. ఓటమి ఎదురైనా తమకు మద్దతు తెలిపిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.ఇటీవల వార్డులో మరణించిన కుటుంబాలను పరామర్శిస్తూ సహాయం అందిస్తున్న రజినీ నవీన్ స్పందన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ముందుకు సాగుతున్న ఆమెకు స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.

## రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు?

మొదటిపేజీ తరువాయి..

ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరావుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు. గోపాలరావుపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు....? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేది కాళేశ్వరం నీళ్లతోనేనని తేల్చిచెప్పారు. తమపై చిల్లర వ్యాఖ్యలను బంద్ చేయాలని.. లేకపోతే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అడ్డగోలు ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహించారు. ఈ ప్రాజెక్టును ఎండబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరిచ్చారా....? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

## 99 రోజుల్లో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

మొదటిపేజీ తరువాయి..

హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ÷ూష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్దేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు.దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు.÷శిటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ హత్యకు ప్లాన్..!?

మొదటిపేజీ తరువాయి..

ట్రంప్‌తో పాటు కొందరు అమెరికా నేతలను హత్య చేయాలని ఆసిఫ్ మెర్చంట్ ప్లాన్ చేశారు. దీని కోసం అమెరికాలో కొందర్ని రిక్రూట్ చేసేందుకు అతను ప్లాన్ చేశాడు. ఆసిఫ్ టార్గెట్‌లో ట్రంప్‌తో పాటు జో బైడెన్, నిక్కీ హేలీ కూడా ఉన్నారు. ఇరాన్ అధికారుల ఆదేశాల ప్రకారం అమెరికా నేతల హత్య కోసం ఆసిఫ్ రిక్రూట్మెంట్‌కు పాల్పడ్డాడని, దీన్ని ఉగ్రవాద చర్యగా భావిస్తున్నామని అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది. న్యూయార్క్ సిటీ కోర్టు ఈ కేసుపై గత వారం వాదనలు జరుగుతున్నాయి. అయితే ఇరాన్‌లోని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో కలిసి హత్యలకు ప్లాన్ చేసినట్లు ఆసిఫ్ మర్చెంట్ అంగీకరించాడు. అయితే టెహ్రాన్‌లో ఉన్న తన ఫ్యామిలీని కాపాడుకోవాలన్న భయంతో ఆ పనిచేసినట్లు చెప్పాడు. ఇరాన్ టాప్ కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీకారంగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సహా ఇతర రాజకీయ నేతల హత్యకు కుట్రలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పాకిస్థాన్ వ్యాపారి ఆసిఫ్ మర్చంట్ ను యూఎస్‌లోని బ్రూక్లిన్ న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. ఇరాన్‌తో సంబంధాలున్న అతడికి ఈ కుట్ర కేసులో జీవిత ఖైదు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వద్ద ఆసిఫ్ మర్చంట్ శిక్షణ పొందినట్లు రుజువైందని అమెరికా న్యాయస్థానం పేర్కొంది.

# మహిళా సాధికారతే తెలంగాణ సర్కార్ ధ్యేయం

'ఆడబిడ్డల అభివృద్ధే..సమాజ అభివృద్ధి' అనేది నానుడి. ఒక మహిళ ఎదిగితే కుటుంబం ఎదుగుతుంది, కుటుంబాలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టేందుకు తెలంగాణ సర్కార్ మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యతని స్తోంది. 'మహిళా ఉన్నతే – తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలపరిచే దిశగా ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలను చేపట్టింది. మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన కోసం సమగ్ర చర్యలు తీసుకుంటోంది. మహిళలను సంఘటిత శక్తిగా తీర్చిదిద్దుతూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు విశేష కృషి చేస్తోంది.

2023 డిసెంబర్లో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం ఈ ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. రోజుకు సగటున 30 లక్షల మంది మహిళలు ఈ పథకం ద్వారా ప్రయాణిస్తూ పెద్దమొత్తంలో డబ్బును ఆదా చేసుకుంటు న్నారు. ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటూ ఆర్థికంగా కొంత భారం తగ్గించుకుంటున్నారు. మహిళల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని భావించిన ప్రభుత్వం 65 లక్షల మహిళా సంఘ సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తోంది. ఆరోగ్య భద్రతతో పాటు ఆర్థిక భద్రత కూడా కల్పించాలని సంకల్పించింది. మహిళా సంఘ సభ్యులకు రెండు లక్షల వరకు లోన్ బీమా, పది లక్షల వరకు ప్రమాద బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు రక్షణ కల్పిస్తోంది. తెలంగాణలో మహిళా సంఘాల వ్యవస్థ బలంగా నిలబడేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 46.68 లక్షల గ్రామీణ పేద మహిళలను 4.37 లక్షల స్వయం సహాయక సంఘాలుగా సమీకరించి, వాటిని గ్రామ సంస్థలు, మండల, జిల్లా మహిళా సమాఖ్యలుగా విస్తరించింది. ఈ వ్యవస్థ ద్వారా మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశాలు పొందుతున్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.36 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందించింది. అంతేకాకుండా వడ్డీ లేని రుణాల పథకం కింద రెండేళ్లలోనే రూ.1,121 కోట్ల వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరించింది. 2014–15లో ఒక్కో సంఘానికి సగటు రుణం రూ.1.90 లక్షలు ఉండగా, 2025–26 నాటికి అది రూ.9.55 లక్షలకు పెరగడం మహిళా ఆర్థిక ప్రగతికి సూచిక.

మహిళల స్వయం ఉపాధికి రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షలకుపైగా మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించి వేలాది మందికి పని కలిపిస్తోంది. మండల మహిళా సమాఖ్యలు తమ పెట్టుబడితో 600 బస్సులు కొనుగోలు చేసి టీజీఎస్ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా నెలకు కోట్ల రూపాయల ఆదాయం పొందుతున్నాయి. ఇందిరమ్మ క్యాంటీన్లు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, యూనిఫామ్ కుట్టు పనులు వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. హైదరాబాద్ ఐటీ హబ్‌లో ఏర్పాటు చేసిన "ఇందిరా మహిళా శక్తి బజార్" గ్రామీణ మహిళా వ్యాపారులకు పట్టణ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానంగా మారింది. అలాగే మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి సరికొత్త రంగాల్లో అడుగుపెడుతూ నెలకు లక్షల రూపాయలు సంపాదించే స్థాయికి ఎదుగుతున్నారు. మహిళల సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా భవనాలను నిర్మిస్తున్నారు. జిల్లా స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. అదేవిధంగా టీనేజీ బాలికలు, వృద్ధ మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి సమగ్ర అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కుటుంబ బాధ్యతల వల్ల మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనలేకపోతున్నారని గుర్తించిన ప్రభుత్వం పిల్లల సంరక్షణ బాధ్యతను కూడా పంచుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు క్రెచ్ కేంద్రాలను ప్రారంభిస్తోంది. వలస కూలీల పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పాలు సరఫరా చేయడంతో పాటు..

వారికి పౌష్టికాహారం అందించేందుకు మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. త్వరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవు తోంది. మొత్తం మీద కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతను ఉద్యమంగా మార్చింది. మహిళలను కుటుంబానికి పరిమితం చేసే పరిస్థితుల నుంచి బయటకు తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాము లుగా నిలబెడుతోంది. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణలో మహిళల సాధికారత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి.



– ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్,
9032042014

## అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాపై కఠిన చర్యలు

### జిల్లాలో వాల్టా చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలి

### అక్రమ రవాణా వాహనాలపై మోటార్ వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్: సంగారెడ్డి జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, గ్రావెల్ రవాణాను కట్టుదిట్టంగా నియంత్రించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టంతో పాటు మోటార్ వాహనాల చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులతో అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణపై చర్చించారు. జిల్లాలో వాల్టా చట్టం అమలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలో ఇసుక, కంకర అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాలో పాల్గొనే వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సహజ ఇసుకకు బదులుగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకే అందిస్తోందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ఇసుకను నిర్ణీత ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని స్పష్టం చేసిన కలెక్టర్, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వినియోగానికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు. మొరం, గ్రావెల్ తవ్వకాలపై సాంకేతికంగా తనిఖీలు నిర్వహించి తవ్వకాల వివరాలు పరిశీలించాలని



తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసిన అక్రమ రవాణా కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై మండల, గ్రామ స్థాయిలలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం. రఘుబాబు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు అస్వస్తత

మొదటిపేజీ తరువాయి..

అస్వస్థతకు గురికావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే కిషోర్ మాక్వానా అస్వస్థతకు గురయ్యారు. ఈ సమావేశంలో ఉండగానే ఆయనకు వాంతులు కావడంతో వెంటనే అధికారులు స్పందించి సమీపంలోని డెల్టా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ మాక్వానా చికిత్స పొందుతున్నారు.

## మహిళల రక్షణ సమాజం బాధ్యత

మొదటిపేజీ తరువాయి..

మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్లు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు.


## గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి



చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ , వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్ , గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని మంత్రి అన్నారు. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశర చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967